సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 17.10.2026


www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 347
పేజీలు: 08 వెల: రూ. 5

తెలంగాణలో హుందాయ్ భారీ పెట్టుబడి

సీఎం రేవంత్‌తో హుందాయ్ ప్రతినిధుల భేటీ

- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్ల హుందాయ్ ఆర్ అండ్ డీ కేంద్రం
- హుందాయ్ ప్రాజెక్టుతో 4,276 ఉద్యోగాలు
- తెలంగాణలో కార్ల తయారీ కేంద్రం ఏర్పాటు చేయండి: సీఎం



02

పట్టభద్రుల ఎమ్మెల్సీ సమరం

కాంగ్రెస్ ముందడుగు

ముద్ర, తెలంగాణ బ్యూరో:
తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి క్రమంగా పెరుగుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు సంబంధించి ముందస్తు వ్యూహాలతో ముందుకు సాగుతుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ మాత్రం అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. అభ్యర్థుల ప్రకటనలో జాప్యం ఆయా పార్టీల శ్రేణులపై ప్రభావం చూపుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పట్టభద్రుల ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించింది. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జులకు బాధ్యతలు అప్పగించి, పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించే కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఉద్యోగ నియామకాలను ప్రచారంలోకి తీసుకెళ్తూ సన్నద్ధమవుతోంది.

బీజేపీలో టికెట్ కోసం పోటీ

బీజేపీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కోసం పలువురు నేతలు పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రాంచందర్‌రావు పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఇతర ముఖ్య నేతలు కూడా టికెట్ ఆశిస్తుండటంతో అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల పేర్లతో నివేదికలను కేంద్ర నాయకత్వానికి పంపినట్లు సమాచారం.

బీఆర్ఎస్‌లోనూ అదే పరిస్థితి

వరుస ఎన్నికల పరాజయాల తర్వాత పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకుని తిరిగి పుంజుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే, విస్తృతమైన నియోజకవర్గాల్లో ప్రచారం నిర్వహించగల, పట్టభద్రుల్లో మంచి గుర్తింపు ఉన్న అభ్యర్థుల కోసం ఆ పార్టీ అన్వేషిస్తోంది. క్షేత్రస్థాయిలో పట్టున్న నేతలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. అభ్యర్థుల ఖరారులో జాప్యంతో పార్టీ శ్రేణుల్లో కొంత అయోమయం నెలకొన్నట్లు తెలుస్తోంది.

అభ్యర్థుల ఇమేజ్ కీలకం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలంతో పాటు అభ్యర్థి వ్యక్తిగత ప్రతిష్ట, విద్యావంతుల్లో ఆదరణ, ముందస్తు ప్రచారం కీలకంగా మారనున్నాయి. కాంగ్రెస్ ఓటర్ల నమోదు ప్రక్రియలో వేగం పెంచుతుండగా, బీజేపీ పట్టణ ప్రాంతాల్లోని తన సంప్రదాయ ఓటు బ్యాంకుపై ఆశలు పెట్టుకుంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును తమకు అనుకూలంగా మలుచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే, అభ్యర్థుల ప్రకటనలో జాప్యం జరిగితే ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారంపై ప్రభావం పడే అవకాశం ఉంది. ప్రధాన పార్టీలు అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తాయన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. అభ్యర్థుల ఖరారు తర్వాతే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకునే అవకాశముంది.

- అభ్యర్థుల ఎంపికలో బీఆర్ఎస్, బీజేపీ మల్లగుల్లాలు..
- ఓటర్ల నమోదులో కాంగ్రెస్ దూకుడు
- బీజేపీ ఎమ్మెల్సీ టికెట్ కోసం నేతల పోటీ
- రాంచందర్‌రావు పేరు చుట్టూ చర్చ!
- బలమైన అభ్యర్థుల కోసం బీఆర్ఎస్ అన్వేషణ
- అభ్యర్థుల ప్రకటనలో జాప్యం.. క్యాడర్‌లో అయోమయం
- పట్టభద్రుల ఓట్లే లక్ష్యంగా పార్టీల వ్యూహాలు
- పార్టీ బలమా.. అభ్యర్థి ఇమేజ్‌నా?
- అభ్యర్థుల ప్రకటనతోనే రాజకీయ వేడి!



- దమ్ముంటే పంపుల కనెక్షన్ తొలగించండి!
- కృష్ణా జలాలపై కేసీఆర్ సంతకం పెట్టలేదా?
- రూ.లక్ష కోట్ల మేడిగడ్డ.. కుంగిపోయిన ప్రాజెక్టు!
- సాగునీటి ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?
- బీఆర్ఎస్‌పై సీఎం ఫైర్



కేసీఆర్ ఫాంహౌస్‌కు కొండపోచమ్మ నీళ్లు!

ఫాంహౌస్‌కు నీళ్ల మళ్లింపు.. రేవంత్ సంచలన ఆరోపణలు

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణలో నాలుగు కోట్ల మంది ప్రజలకు లేని ప్రత్యేక ఏర్పాట్లు, వెసులుబాట్లు మాజీ సీఎం కేసీఆర్‌కు ఎందుకు కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కొండపోచమ్మ రిజర్వాయర్ నుంచి పంచపాండవుల చెరువుకు కాలువ తవ్వి, అక్కడి నుంచి కేసీఆర్ ఫాంహౌస్‌కు సాగునీటిని మళ్లించారని ఆరోపించారు. దమ్ముంటే ఆ పంపుల కనెక్షన్‌ను తొలగించేందుకు కేసీఆర్ ముందుకు వస్తారా అని సవాల్ విసిరారు. ఫాంహౌస్‌కు నీటి తరలింపు వ్యవహారంపై నిజనిర్ధారణ కమిటీ వేద్దామా అని బీఆర్ఎస్ నాయకులకు సవాల్ విసిరారు.

కేసీఆర్ సంతకం పెట్టలేదా?
ఈ సందర్భంగా మహారాష్ట్ర, ఏపీ, తమిళనాడు, యూకే దేశాల ప్రస్తావన తెస్తూ.. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై విపక్షాలు చేస్తున్న విమర్శలను సీఎం తిప్పికొట్టారు. వంద దేశాల్లో ఎల్‌నినో సమస్య ఉందని ఐరాస చెబుతుంటే, బీఆర్ఎస్ నాయకులు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌లో ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు అని కొందరు అంటున్నారని, కానీ 2015లో కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీలు, ఏపీకి 515 టీఎంసీలని కేసీఆర్ సంతకం పెట్టలేదా అని ప్రశ్నించారు. బచావత్ ట్రైబ్యునల్ వద్ద తెలంగాణకు శాశ్వతంగా మరణ శాసనం రాసింది ఎవరని నిలదీశారు. సీఎం బాబు ముందు మోకరిల్లి కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను ధారాదత్తం చేశారని ఆరోపించారు. **మిగతా 02లో**

పుంగనూరులో రచ్చ

టీడీపీ, వైసీపీ శ్రేణుల మధ్య ఘర్షణ

- రాళ్లు, కర్రలతో ఇరు వర్గాల దాడులు
- గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఏపీలో 'స్థానిక' పోరులో తొలిరోజే హింస



02

ముఖానికి నాట్లు వేసుకొని తిరుగుతున్నాడు

కేటీఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి సెటైర్లు

- ప్రభుత్వం అప్రమత్తంగా లేదన్న బీఆర్ఎస్ విమర్శలపై సీరియస్
- యాదాద్రి పవర్ ప్లాంట్ బొగ్గు లభ్యతపై ముందస్తు జాగ్రత్త తీసుకోలేదు


02

సీజేపీ తిరంగా యాత్ర

ఢిల్లీలో హైఅలర్ట్

- తిరంగా మార్చ్‌కు పోలీసుల ఆంక్షలు.. సెంట్రల్ పార్క్ మూసివేత
- అభిజీత్ దీప్కేకు ఢిల్లీ పోలీసుల నోటీసులు
- సీఈసీ రాజీనామా డిమాండ్‌తో సీజేపీ తిరంగా యాత్ర
- కన్నాట్ ప్లేస్‌లో ట్రాఫిక్ ఆంక్షలు.. ప్రయాణికులకు సూచనలు

ముద్ర, న్యూఢిల్లీ :
దేశ రాజధాని ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో తిరంగా యాత్ర నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సీజేపీ ఆధ్వర్యంలో నేడు సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న తిరంగా యాత్ర దృష్ట్యా సెంట్రల్ పార్క్‌ను నేడు, రేపు మూసివేస్తున్నట్లు న్యూఢిల్లీ మున్సిపల్ కౌన్సిల్ ప్రకటించింది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు భారతీయ నాగరిక్ సురక్షా సంహిత సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. సీజేపీ నిరసన కార్యక్రమానికి ప్రజలు దూరంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

అయితే, జాతీయ జెండాను ఎగురవేసి, జాతీయ గీతాన్ని ఆలపించేందుకు 11 మందితో కూడిన బృందానికి అనువైన ప్రదేశంలో అవకాశం కల్పిస్తామని పోలీసులు స్పష్టం చేశారు. మరోవైపు, కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో మధ్యాహ్నం 3 గంటల



02

విజయవాడ దుర్గమ్మను దర్శించుకున్న చంద్రబాబు

ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టు వస్త్రాలు, సారె సమర్పణ

- ముఖ్యమంత్రికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు
- దర్శనానంతరం పండితుల వేదాశీర్వచనం
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు


02

ఓఆర్ఆర్ కేసులో మలుపు


సుప్రీంకోర్టులో హెచ్ఎండీఏకి షాక్

- ఓఆర్ఆర్ ఆర్బిట్రేషన్ కేసులో హెచ్ఎండీఏ పిటిషన్ డిస్మిస్
- హైకోర్టు తీర్పులో జోక్యానికి సుప్రీం నిరాకరణ
- న్యాయమూర్తి తప్పుకోవాలన్న విజ్ఞప్తి తిరస్కరణ
- ఆర్బిట్రేషన్ ప్రక్రియకు మరో నాలుగు వారాల గడువు



02

ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
17 అక్టోబర్, 2026

శరీరానికి శక్తినిచ్చే ఇడ్లీలు!

ఇడ్లీలో ఉండే బియ్యం, మినపప్పు ద్వారా కార్బోహైడ్రేట్లు, కొంత ప్రోటీన్ లభిస్తాయి. ఇవి శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో సహాయపడతాయి. పోషక విలువలు పెరగాలంటే ఇడ్లీలతో పాటు పప్పు లేదా సాంబార్ తీసుకోవడం మంచిది.



పుంగనూరులో రచ్చ

ముద్ర, డెస్క్:

ఆంధ్ర రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల పర్వం మొదలైంది. అయితే నామినేషన్ల తొలిరోజే స్థానిక ఎన్నికల వేడి రాజుకుంది. అన్నమయ్య జిల్లాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలోని పుంగనూరు, రాయచోటిలో వైఎస్సార్సీపీ, టీడీపీ వర్గాలు పరస్పరం ఘర్షణకు దిగాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్తున్న క్రమంలో రెండు పార్టీల నేతలు దాడులకు పాల్పడ్డారు. ఈ క్రమంలో జరిగిన రాళ్లదాడిలో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి. రాయచోటిలోని ఎన్ఎన్ కాలనీలో వాహనాలకు నిప్పంటించారు. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి భారీ కాన్వాయ్‌తో పుంగనూరు పురపాలక సంఘం అధ్యక్ష పదవికి, వార్డు కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను, భారీ బలగాన్ని వెంటబెట్టుకొని బయల్దేరారు. మరోవైపు టీడీపీ అభ్యర్థులు కూడా కొందరు నామినేషన్లు వేసేందుకు కార్యాలయానికి వెళ్లారు. ఎంపీ మిథున్‌రెడ్డి కార్యాలయంలోకి వెళ్లడంపై టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు మిథున్‌రెడ్డిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. మిథున్‌రెడ్డి పోలీసుల్ని లెక్క చేయకుండా తన వాహనశ్రేణిని బారికేడ్ల మీదుగా తీసుకెళ్లారు.ఈ క్రమంలో భద్రత బలగాల్లో ఉన్న ఓ పోలీసుకు గాయాలయ్యాయి. దీంతో మిథున్‌రెడ్డి వైఖరిని నిరసిస్తూ టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. మిథున్‌రెడ్డితో పాటు వచ్చిన ఆయన అనుచరులు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆందోళన చేస్తున్న టీడీపీ నేతలపై రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడుల్లో పుంగనూరు పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు మధు రాయల్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలకు గాయాలయ్యాయి.

వాహనాలు ధ్వంసం

రాయచోటి పట్టణంలోని ఎన్ఎన్ కాలనీలో టీడీపీ–వైఎస్సార్సీపీ కార్యకర్తలు దాడులు చేసుకున్నారు. పరస్పరం రాళ్లు, కర్రలతో ఇరువర్గాలు దాడికి పాల్పడ్డాయి. కార్లకు నిప్పు పెట్టారు. పలు వాహనాలు ధ్వంసం కాగా పలు కార్లు మంటల్లో దగ్ధమయ్యాయి. పోలీసు వాహనాన్ని ధ్వంసం చేశారు. కానిస్టేబుల్ పెంచలయ్యకు గాయాలయ్యాయి. ఈ ఘటనలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు నేతలకు గాయాలయ్యాయి. కొన్ని వాహనాలు ధ్వంసమయ్యాయి.

సీజేపీ తిరంగా యాత్ర

(మొదటి పేజీ తరువాయి)

నుంచే ట్రాఫిక్ ఆంక్షలు అమల్లోకి రానున్నాయి. ఈ ప్రాంతం మీదుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు పోలీసుల సూచనలను పాటించాలని అధికారులు కోరారు. తిరంగా యాత్ర నేపథ్యంలో కన్నాట్ ప్లేస్ పరిసరాల్లో రాకపోకలపై ఆంక్షలు ఉండటంతో ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని సూచించారు.

సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే బస చేసిన కరోల్‌బాగ్‌లోని ఇంటివద్దకు దిల్లీ పోలీసులు వెళ్లారు. తిరంగా మార్చ్ చేపట్టవద్దంటూ దీప్కేకు నోటీసులు ఇచ్చారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. సర్ ప్రక్రియకు వ్యతిరేకంగా దిల్లీలోని సెంట్రల్ పార్క్ వద్ద శుక్రవారం సాయంత్రం ఐదు గంటలకు జాతీయ జెండాను ఎగరవేయాలని సీజేపీ తన మద్దతుదారులకు పిలుపునిచ్చింది. సీజేపీ సభ్యులు సౌరవ్ దాస్, అశుతోశ్ రంకా అరెస్టు కూడా ఈ మార్చ్‌కు మరో కారణం. ఈ నేపథ్యంలోనే దీప్కేకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రజలను రెచ్చగొడుతున్నారని, అలాంటి చర్యలు చట్టవిరుద్ధమని అందులో పేర్కొన్నారు. అయితే.. ఈ ఆరోపణలు హాస్యాస్పదమని, హింసను ప్రేరేపించేవిధంగా ఉన్న ఒక్క వీడియోనైనా చూపించాలని దీప్కే పోలీసులతో అన్నారు. మార్చ్‌కు ముందు పోలీసులు తనను అదుపులోకి తీసుకుంటారని దీప్కే ఇప్పటికే వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. దిల్లీకి చేరుకున్న అభిజీత్.. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత గవండే నివాసంలో బస చేశారు.

రాష్ట్ర చరిత్రలో సరికొత్త రికార్డు..

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరింది. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 20,003 మెగావాట్లకు చేరడంతో విద్యుత్ రంగంలో కొత్త రికార్డు నమోదైంది. అక్టోబర్ 15న ఉదయం 10:29 గంటలకు ఈ స్థాయి డిమాండ్ నమోదైనట్లు విద్యుత్ సంస్థలు వెల్లడించాయి. వ్యవసాయం, గృహావసరాలు, వాణిజ్య సంస్థలు, ఐటీ రంగం, పారిశ్రామిక కార్యకలాపాల్లో విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో రాష్ట్రవ్యాప్తంగా డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా సంబంధిత సంస్థలు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం 2025–26లో రాష్ట్రంలో నమోదైన గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 18,548 మెగావాట్లు కాగా, తాజాగా అది మరో 1,455 మెగావాట్లు పెరిగి 20,003 మెగావాట్లకు చేరింది. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ వినియోగం 334.54 మిలియన్ యూనిట్లకు చేరడం గమనార్హం. అక్టోబర్ 1 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్ర సగటు గరిష్ఠ డిమాండ్ 19,289 మెగావాట్లుగా నమోదైంది. ఇదే సమయంలో సగటు రోజువారీ విద్యుత్ వినియోగం 321.34 మిలియన్ యూనిట్లుగా నమోదైంది. ఈ గణాంకాలు రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలను స్పష్టం చేస్తున్నాయి.

అన్ని రంగాల్లో పెరుగుతున్న విద్యుత్ అవసరాలు

రాష్ట్రంలో వ్యవసాయ రంగంతో పాటు గృహ, వాణిజ్య, ఐటీ, పారిశ్రామిక రంగాలు విద్యుత్‌పై ఎక్కువగా ఆధారపడుతున్నాయి. పట్టణీకరణ, పారిశ్రామిక విస్తరణ, కొత్త వాణిజ్య సంస్థల ఏర్పాటు, గృహ విద్యుత్ వినియోగం పెరుగుదల డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. మరోవైపు వ్యవసాయ రంగంలో బోర్లపై ఆధారపడే రైతుల సంఖ్య, మోటార్ల వినియోగం పెరగడం కూడా విద్యుత్ అవసరాలపై అదనపు ఒత్తిడిని పెంచుతోంది. ముఖ్యంగా భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో సాగునీటి కోసం బోర్లను ఎక్కువగా వినియోగించాల్సి వస్తోంది. దీంతో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ అవసరం పెరుగుతోంది. ఒకవైపు వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ అందించాల్సిన బాధ్యత ఉండగా, మరోవైపు గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు సరఫరా చేయాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి, కొనుగోలు, పంపిణీ వ్యవస్థలను సమన్వయంతో నిర్వహించాల్సిన పరిస్థితి ఉంది.

TGSPDCL పరిధిలోనూ రికార్డు స్థాయి డిమాండ్

తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL) పరిధిలోనూ విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. అక్టోబర్ 15న ఈ పరిధిలో 12,281 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. అదే రోజు రోజువారీ విద్యుత్ వినియోగం 228.14 మిలియన్ యూనిట్లకు చేరింది. గత ఏడాది నమోదైన గరిష్ఠ రోజువారీ వినియోగం 222.34 మిలియన్ యూనిట్లతో పోలిస్తే తాజా వినియోగం 5.80 మిలియన్ యూనిట్లు అధికంగా ఉంది. ఇదే సంస్థ పరిధిలో సెప్టెంబర్ 30న సాయంత్రం 4:16 గంటలకు 12,299 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ నమోదైంది. గత ఆర్థిక సంవత్సరంలో నమోదైన గరిష్ఠ డిమాండ్ 11,318 మెగావాట్లు మాత్రమే. దీంతో గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ అవసరాలు ఎంత వేగంగా పెరుగుతున్నాయో అర్థమవుతోంది. పెరుగుతున్న వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తున్న అధికారులు, అవసరమైన చోట సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు, ఇతర పరికరాల పనితీరును పర్యవేక్షిస్తూ సరఫరా అంతరాయాలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. డిమాండ్ పెరిగిన సమయంలోనూ వినియోగదారులకు సాధ్యమైనంత మెరుగైన సేవలు అందించేందుకు ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారు.

హైదరాబాద్‌లోనూ పెరుగుతున్న డిమాండ్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో విద్యుత్ అవసరాలు మరింతగా పెరుగుతున్నాయి. గృహ వినియోగంతో పాటు ఐటీ సంస్థలు, వాణిజ్య సముదాయాలు, కార్యాలయాలు, పారిశ్రామిక కార్యకలాపాల విస్తరణ నగర విద్యుత్ డిమాండ్‌పై ప్రభావం చూపుతోంది. GHMC పరిధిలో అక్టోబర్ 15న సాయంత్రం 6:19 గంటలకు 4,220 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ డిమాండ్ నమోదైంది. అక్టోబర్ 9న రోజువారీ విద్యుత్ వినియోగం 88.22 మిలియన్ యూనిట్లకు చేరింది. గతేడాది అక్టోబర్‌లో హైదరాబాద్ పరిధిలో నమోదైన గరిష్ఠ డిమాండ్ 3,552 మెగావాట్లు కాగా, ఈసారి అది 4,220 మెగావాట్లకు చేరింది. అంటే గత ఏడాది గరిష్ఠ స్థాయితో పోలిస్తే ఈసారి 668 మెగావాట్ల మేర పెరిగింది. నగరంలో పెరుగుతున్న జనాభా, కొత్త నివాస సముదాయాలు, వాణిజ్య కార్యకలాపాలు, ఐటీ రంగం విస్తరణ విద్యుత్ అవసరాలను పెంచుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత పరిస్థితుల్లో ఏసీలు, కూలర్లు, ఇతర శీతలీకరణ పరికరాల వినియోగం పెరగడం కూడా విద్యుత్ డిమాండ్‌కు కారణమవుతోంది. గృహాలు, కార్యాలయాలు, వాణిజ్య సంస్థల్లో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటంతో నగరంలో సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

పాదుపుగా విద్యుత్ వినియోగించాలి: సీఎండీ

రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు TGSPDCL సీఎండీ జితేష్ పాటిల్, ఐఏఎస్ తెలిపారు. వ్యవసాయ రంగం, గృహావసరాలు, వాణిజ్య సంస్థలు, ఐటీ, పారిశ్రామిక రంగాలకు అవసరమైన విద్యుత్‌ను అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ కొనుగోలు, ఉత్పత్తి సామర్థ్యాల పెంపు వంటి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అయితే విద్యుత్ అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో వినియోగదారులు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు. అవసరం లేనప్పుడు విద్యుత్ పరికరాలను ఆపివేయడం, విద్యుత్‌ను సమర్థంగా వినియోగించే పద్ధతులను పాటించడం ద్వారా వృథాను నివారించవచ్చని సూచించారు. విద్యుత్ పొదుపు అనేది కేవలం విద్యుత్ సంస్థల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి వినియోగదారుడి భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా కార్యాలయాలు, వాణిజ్య సంస్థలు, గృహాల్లో అవసరానికి మించి విద్యుత్ వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ పరికరాలను అవసరమైనప్పుడే వినియోగించడం, వినియోగం పూర్తయిన వెంటనే ఆపివేయడం వంటి చిన్నచిన్న చర్యలు కూడా మొత్తం డిమాండ్‌ను నియంత్రించడంలో సహాయపడతాయని తెలిపారు.

నీటి పొదుపునకూ ప్రాధాన్యం ఇవ్వాలి

విద్యుత్ పొదుపుతో పాటు నీటి సంరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సీఎండీ సూచించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు తగ్గుతున్న నేపథ్యంలో నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బోర్లపై ఆధారపడే వ్యవసాయ ప్రాంతాల్లో నీటి లభ్యత తగ్గితే రైతులు మరింత లోతుగా బోర్లు వేయాల్సి వస్తోందని, మోటార్ల వినియోగం పెరుగుతోందని పేర్కొన్నారు. దీనివల్ల విద్యుత్ అవసరాలపై అదనపు భారం పడుతోందని వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించడం, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థంగా నిర్వహించడం, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు పాటించడం ద్వారా నీరు, విద్యుత్ రెండింటినీ సంరక్షించవచ్చని సూచించారు. విద్యుత్, నీటి వనరుల వినియోగంలో ప్రజలు బాధ్యతాయుతమైన విధానాలను అనుసరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల వద్దకే విద్యుత్ అధికారులు

వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు TGSPDCL ప్రత్యేక చర్యలు చేపడుతోంది. సీఎండీ జితేష్ వి. పాటిల్ ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు గత వారం రోజులుగా 'పొలం బాట' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ప్రతిరోజూ ఉదయం నుంచే క్షేత్రస్థాయికి వెళ్లి రైతులతో మాట్లాడుతున్నారు. వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా రైతులు విద్యుత్ సరఫరా, తక్కువ వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు, విద్యుత్ లైన్లలో లోపాలు, మోటార్లకు సంబంధించిన సమస్యలను ఎదుర్కొంటుంటారు. ఈ సమస్యలు సాగు పనులకు ఆటంకం కలిగించకుండా ముందుగానే గుర్తించి పరిష్కరించడమే 'పొలం బాట' కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అధికారులు నేరుగా పొలాల వద్దకు వెళ్లి పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

భూగర్భ జలాలు, పంటల పరిస్థితిపై సమన్వయ పర్యవేక్షణ

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితులతో పాటు భూగర్భ జలమట్టాలు, బోర్లలో నీటి లభ్యత, వ్యవసాయ మోటార్ల పనితీరు, పంటల పరిస్థితులను అధికారులు పరిశీలిస్తున్నారు. సాగునీటి అవసరాలకు అనుగుణంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత సిబ్బందితో సమన్వయం చేసుకుంటున్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సర్వీస్ వైర్లలో సమస్యలు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తక్కువ వోల్టేజీ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల లోపాలు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై దృష్టి సారిస్తున్నారు. సమస్యలు గుర్తించిన వెంటనే సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి, వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు సాగు నీరు అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరా పరంగా ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షణను కొనసాగిస్తున్నారు.

రైతులకు అండగా విద్యుత్ శాఖ

రైతుల సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా నేరుగా పొలాల వద్దకు వెళ్లి తెలుసుకోవడం ద్వారా సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయవచ్చని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ విద్యుత్ సరఫరా సజావుగా సాగితే రైతులు సాగు పనులను ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అందుకే క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, వారి ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా ట్రాన్స్‌ఫార్మర్ల సమస్యలు, విద్యుత్ లైన్లలో లోపాలు, తక్కువ వోల్టేజీ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నారు. వ్యవసాయ విద్యుత్ పరికరాల పనితీరును పర్యవేక్షిస్తూ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రాధాన్యం ఇస్తూ సంబంధిత విభాగాల మధ్య సమన్వయాన్ని పెంచుతున్నారు.

సిబ్బంది కృషికి సీఎండీ అభినందనలు

రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరినప్పటికీ సరఫరా వ్యవస్థను సమర్థంగా నిర్వహించడంలో ఇంజినీర్లు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి కీలకమని సీఎండీ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణ, సమన్వయం, అంకితభావంతో పనిచేస్తున్న సిబ్బందిని అభినందించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులు ఇదే స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. ఒకవైపు రాష్ట్రవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడం, మరోవైపు వ్యవసాయ రంగానికి అవసరమైన విద్యుత్‌ను అందించడం విద్యుత్ సంస్థలకు కీలకంగా మారింది. ఈ నేపథ్యంలో విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ చర్యలు కొనసాగిస్తోంది.

ముఖానికి నాట్లు వేసుకొని తిరుగుతున్నాడు

ముద్ర, హైదరాబాద్ :

రాష్ట్రంలో విద్యుత్ కష్టాలను తీర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను బీఆర్ఎస్ నేతలు విమర్శించడంపై సీఎం సీరియస్ అయ్యారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో నాణ్యమైన బొగ్గు లేకపోవడంతో విద్యుత్ ఉత్పత్తి కష్టతరం అవుతుందని, నాణ్యమైన బొగ్గు సేకరణ కోసం కోల్ ఇండియాతో అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నామని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడాం అనే విషయం చెప్పారు.

రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తంగా లేదన్న బీఆర్ఎస్ విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణంలోనే బొగ్గు నాణ్యతపై ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోలేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ఈ ప్రయత్నాలన్నీ తెలియక ముఖానికి బొగ్గులు పూసుకుని, నాట్లు వేసుకుని తిరుగుతున్నారని కేటీఆర్‌పై ఘాటు విమర్శ చేశారు.

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ సీఈపై ప్రభుత్వం చర్యలు

తెలంగాణలో రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, సరఫరా సమస్యల వేళ నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నల్గొండ జిల్లా దామరచర్లలో నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలపై ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ సురేష్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పవర్ ప్లాంట్ నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత విషయంలో ఎలాంటి ఉపేక్షేంచేది లేదన్నారు. భవిష్యత్తులోనూ విధుల్లో అలసత్వం వహించే ఎంతటి ఉన్నతాధికారులనైనా వదిలిపెట్టేది లేదని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

రాష్ట్రంలో కొన్ని రోజులుగా పీక్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుకోవడం, మరోవైపు అకాల విద్యుత్ కోతలు, సరఫరా అంతరాయాలు తలెత్తడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ యూనిట్ల పురోగతిపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన తరువాత, ప్రాజెక్టు పనులను వేగవంతం చేయడానికి, క్షేత్రస్థాయి సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్లాంట్ నిర్వహణ, ఇంజనీరింగ్ పనుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రత్యేకంగా ఐదుగురు ఐఏఎస్ అధికారులకు అప్పగిస్తూ సాధారణ పరిపాలన శాఖ అక్టోబర్ 14న అధికారిక ఉత్తర్వులు విడుదల చేసింది.

కేసీఆర్ ఫాంహౌస్‌కు కొండపోచమ్మ నీళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

లక్ష కోట్లతో కడితే కుంగిపోయింది

ఉమ్మడి రాష్ట్రంలోనూ ఈ స్థాయి సప్లం జరగలేదని సీఎం రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ప్రాజెక్టులపై రూ.1.8 లక్షల కోట్లు ఖర్చుచేసి, రూ.40 వేల కోట్లు బకాయిలు పెట్టారని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి పంపులు ఆన్‌చేస్తే బీఆర్ఎస్ నాయకులకు కడుపుమంట వస్తోందని ఎద్దేవా చేశారు. కృష్ణా, గోదావరి ప్రాజెక్టులపై ఎన్నిసార్లయినా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. గోదావరి నదిపై పేరు మార్చి రూ.లక్ష కోట్లతో కట్టిన మేడిగడ్డ ప్రాజెక్టు కుంగిపోయిందని, ఇప్పుడు మళ్లీ కట్టాలంటున్నారని విమర్శించారు. ప్రజలు అమాయకులు కాదని, అన్నింటిపై వారికి పూర్తి అవగాహన ఉందని సీఎం స్పష్టం చేశారు.



తెలంగాణలో హుందాయ్ భారీ పెట్టుబడి..

ముద్ర, హైదరాబాద్ :

తెలంగాణలో పారిశ్రామిక రంగానికి మరో భారీ ఊరట లభించింది. ప్రముఖ ప్రముఖ గ్లోబల్ ఆటోమొబైల్ దిగ్గజం 'హుందాయ్ మోటార్స్' రాష్ట్రంలో భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. శుక్రవారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డితో హుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ (MD) చాంగ్యో చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ భేటీ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్ (NIMZ) పరిధిలో రూ. 8,528 కోట్లు పెట్టుబడితో తమ అంతర్జాతీయ స్థాయి రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (R&D) ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు హుందాయ్ ప్రతినిధులు సీఎంకు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలోని యువతకు సుమారు 4,276 కొత్త ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. అత్యంత ఆధునిక ఆటోమోటివ్ టెస్ట్ ట్రాక్, పైలట్ ప్రొడక్షన్ లైన్, ప్రొటోటైపింగ్ ప్లాట్‌ఫామ్‌లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు స్పష్టం చేశారు.

తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయండి: సీఎం

హుందాయ్ ప్రతినిధుల విజ్ఞప్తులపై సీఎం రేవంత్ అత్యంత సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ డీ కేంద్రానికి కావలసిన అనుమతులను వేగవంతంగా జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే సమయంలో తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అత్యంత అనుకూలమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని సీఎం వివరించారు. కేవలం పరిశోధనా కేంద్రానికే పరిమితం కాకుండా, రాబోయే రోజుల్లో హుందాయ్ కార్ల తయారీ కేంద్రాన్ని తెలంగాణలోనే ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కంపెనీ యాజమాన్యానికి రేవంత్ రెడ్డి ప్రతిపాదన చేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న సీఎం

ముద్ర, హైదరాబాద్ :

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి శుక్రవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను వారు సమర్పించారు.

ఇంద్రకీలాద్రికి చేరుకున్న ముఖ్యమంత్రి దంపతులకు దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఆలయ కార్యనిర్వహణాధికారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ మర్యాదలతో వారిని అమ్మవారి దర్శనానికి తీసుకువెళ్లారు. గర్భాలయంలో చంద్రబాబు దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం, రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి పట్టువస్త్రాలను, ఆయన అర్ధాంగి సారెను అమ్మవారికి సమర్పించారు. దర్శనం ముగిసిన అనంతరం, ఆలయ పండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థప్రసాదాలను, జ్ఞాపికను అందజేశారు.

ఓఆర్ఆర్ కేసులో కీలక మలుపు

ముద్ర, హైదరాబాద్:

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ)కు సుప్రీంకోర్టులో తీవ్ర ఎదురుదెబ్బ తగిలింది. ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) ఆర్బిట్రేషన్ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హెచ్ఎండీఏ దాఖ

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 17.10.2026
www.mudranews.in | @mudranews

బరువు నియంత్రణకు ఉపయోగపడే అల్పాహారం!

ఇడ్లీలు ఆవిరిపై ఉడుకుతాయి కాబట్టి సాధారణంగా నూనె తక్కువగా ఉంటుంది. తగిన పరిమాణంలో ఇడ్లీలు తీసుకుంటూ, అధిక కొవ్వు కలిగిన చట్నీలను పరిమితం చేస్తే బరువు నియంత్రణకు తోడ్పడవచ్చు.




సీఎం రేవంత్ రెడ్డికి బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల ఆహ్వానం



ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో యువ సినీ ప్రతిభను ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ –2026' అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. టీజీఎఫ్ డీసీ చైర్మన్ దిల్ రాజు ప్రతినిధి బృందం ముఖ్యమంత్రిని కలిసి కార్యక్రమానికి ఆహ్వాన పత్రాన్ని అందజేసింది.ఈ సందర్భంగా సినీ దర్శకుడు హరీష్ శంకర్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, చరణ్ అర్జున్, నల్గొండ గద్దర్ తదితరులు ప్రతినిధి బృందంలో పాల్గొన్నారు. యువ ఫిల్మ్ మేకర్స్ తమ సృజనాత్మకతను చాటుకునేందుకు, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను వెండితెరపై ఆవిష్కరించేందుకు ఈ కార్యక్రమం వేదికగా నిలవనుంది. ఈ నెల 17న హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన యువ చిత్ర నిర్మాతలు, దర్శకులను అవార్డులతో సత్కరించనున్నారు. తెలంగాణలో సినీ రంగ అభివృద్ధికి, కొత్త తరం ఫిల్మ్ మేకర్లను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం దోహదపడనుంది.

సరస్వతీ దేవి అలంకారంలో నిమిషాంబ అమ్మవారు



ముద్ర, బోడుప్పల్ : శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మూలా నక్షత్రం సందర్భంగా బోడుప్పల్ లోని శ్రీ మాతా నిమిషాంబ దేవి అమ్మవారు సరస్వతీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చదువుల తల్లి, జ్ఞానప్రదాయినిగా అమ్మవారిని భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు.

మూలా నక్షత్రానికి ప్రత్యేక ప్రాధాన్యం

శరన్నవరాత్రుల్లో మూలా నక్షత్రానికి విశేష ప్రాధాన్యం ఉంది. మూలా నక్షత్రాన్ని చదువుల తల్లి సరస్వతీ దేవి జన్మ నక్షత్రంగా భక్తులు భావిస్తారు. ఈ పవిత్రమైన రోజున అమ్మవారిని ఆరాధిస్తే విద్య, జ్ఞానం, వివేకం, జ్ఞాపకశక్తి, వాక్చాతుర్యం వృద్ధి చెందుతాయని భక్తుల విశ్వాసం. ముఖ్యంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడానికి ఈ రోజును అత్యంత శుభప్రదంగా భావిస్తారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు, ఉన్నత విజయాలు సాధించేందుకు సరస్వతీ దేవి ఆశీస్సులు కోరుకుంటారు. అందుకే మూలా నక్షత్రం రోజున అమ్మవారిని సరస్వతీ దేవి అలంకారంలో దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని భక్తులు విశ్వసిస్తారు. సరస్వతీ దేవిని ఆరాధించడం ద్వారా చిన్నారులకు విద్యాబుద్ధులు, విద్యార్థులకు ఉన్నత విజయాలు, అందరికీ సుఖశాంతులు కలగాలని ఆకాంక్షించారు. మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం మరియు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదిగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరిగింది. విద్యార్థినీ విద్యార్థులు విద్యారంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జ్ఞానసంపన్నులుగా రాణించాలని ఆకాంక్షిస్తూ సామూహిక శ్రీ సరస్వతీ దేవి హోమం నిర్వహించడం జరిగింది. హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం, హంపీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ మాతా నిమిషాంబ దేవి ట్రస్ట్ ఈ వివరాలను వెల్లడించింది.

తెలంగాణలో 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లు..

రూ.425.50 కోట్లతో అనుమతులు

ముద్ర, హైదరాబాద్: తెలంగాణలో వాహనాల ఫిట్‌నెస్ పరీక్షలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ల (ATS) ఏర్పాటుకు రూ.425.50 కోట్లతో సవరించిన పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తూ రవాణా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్టేషన్లను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో 15 స్టేషన్లకు రూ.172.50 కోట్లు, రెండో దశలో మరో 22 స్టేషన్లకు రూ.253 కోట్లు కేటాయించారు. ఒక్కో స్టేషన్ ఏర్పాటుకు రూ.11.50 కోట్ల వ్యయాన్ని ప్రభుత్వం ఆమోదించింది. స్టేషన్ల ఏర్పాటు, నిర్వహణ కోసం రవాణా శాఖ పరిధిలో ప్రత్యేక ప్రయోజన వాహనం (SPV) ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను HUDCO వంటి ఆర్థిక సంస్థల నుంచి రుణాల రూపంలో సమీకరించనున్నారు. ఫిట్‌నెస్ పరీక్షల ద్వారా వచ్చే రుసుములను స్టేషన్ల నిర్వహణ, రుణాల చెల్లింపులకు వినియోగించనున్నారు. ఈ ప్రక్రియకు అవసరమైన విధివిధానాలను రూపొందించి ప్రతిపాదనలు సమర్పించాలని రవాణా కమిషనర్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

సీఎం రేవంత్ రెడ్డికి కావ్య మారన్ వివాహ రిసెప్షన్ ఆహ్వానం



ముద్ర, హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కుమార్తె కావ్య మారన్ వివాహ రిసెప్షన్‌కు హాజరు కావాలని కోరుతూ సీఎంను ఆహ్వానించారు. ఈ సందర్భంగా రిసెప్షన్‌కు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు. కావ్య మారన్, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వివాహ రిసెప్షన్ నవంబర్ 21న చెన్నైలో జరగనుంది. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు, సినీ, రాజకీయ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో కళానిధి మారన్ దంపతులు ప్రముఖులను స్వయంగా కలిసి వేడుకకు ఆహ్వానిస్తున్నారు.

రాష్ట్ర ప్రయోజనాలపై 8 కీలక ప్రతిపాదనలు

బొగ్గు నుంచి బుల్లెట్ వేగం వరకు..
కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కోరిన మంత్రి
వినతులపై కిషన్‌రెడ్డి సానుకూల స్పందన..
కోల్ ఇండియా ఎండీకి అప్పటికప్పుడే ఫోన్

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్ర అభివృద్ధి.. రైతుల సంక్షేమం.. పారిశ్రామిక ప్రగతి.. గిరిజన ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయాలు.. విద్య, పరిశోధన రంగాల బలోపేతమే లక్ష్యంగా తెలంగాణ వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ వేదికగా కీలక ప్రయత్నాలు చేశారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని శుక్రవారం కలిసి రాష్ట్రానికి సంబంధించిన ఎనిమిది ప్రధాన అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పెండింగ్ సమస్యలకు పరిష్కారం చూపాలని, కీలక ప్రాజెక్టులకు వేగం పెంచాలని కోరారు. ముఖ్యంగా కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయ అభివృద్ధికి కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించడంతోపాటు కోల్ ఇండియా ఎండీతో అప్పటికప్పుడే ఫోన్‌లో మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

యాదాద్రి విద్యుత్ కేంద్రానికి బొగ్గు భరోసా

యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి అవసరమైన బొగ్గును ముఖ్యమంత్రి కోరిన విధంగా మహానది బొగ్గు క్షేత్రాల నుంచి కేటాయించాలని తుమ్మల కోరారు. రాష్ట్ర విద్యుత్ అవసరాలను తీర్చడంలో కీలకమైన ఈ కేంద్రానికి నిరంతరాయంగా బొగ్గు సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణికి సత్తుపల్లి బ్లాక్-III

సత్తుపల్లి బ్లాక్-III బొగ్గు గనిని సింగరేణి కాలరీస్‌కు కేటాయించాలని ప్రతిపాదించారు. ఇప్పటికే సింగరేణి నిర్వహిస్తున్న గనులకు సమీపంలో ఈ బ్లాక్ ఉండటంతో అందుబాటులోని మౌలిక వసతులను వినియోగించుకోవచ్చని వివరించారు. తద్వారా తవ్వకాలు త్వరగా ప్రారంభించడంతోపాటు అదనపు భూసేకరణ అవసరాన్ని, పర్యావరణంపై ప్రభావాన్ని తగ్గించే అవకాశముంటుందని పేర్కొన్నారు.



ఆర్ఎఫ్‌సీఎల్ సమస్యకు శాశ్వత పరిష్కారం

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో సాంకేతిక సమస్యలతో ఉత్పత్తి నిలిచిపోతుండటంతో రాష్ట్రంలో యూరియా సరఫరాకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని మంత్రి వివరించారు. ముఖ్యంగా ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎదురైన అంతరాయాలు రబీ సీజన్‌లో రైతులకు ఎరువుల లభ్యతపై ప్రభావం చూపే ప్రమాదం ఉందన్నారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జె.పి.నడ్డాతో చర్చించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, తెలంగాణ అవసరాలకు అనుగుణంగా యూరియా కేటాయింపులు ఉండేలా చూడాలని కోరారు.

వర్సిటీకి రూ.100 కోట్ల సీఎస్ఆర్ నిధులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని జాతీయ స్థాయి విద్యా, పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కోల్ ఇండియా సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.100 కోట్లు మంజూరు చేయాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. ఎర్త్ సైన్సెస్, మైనింగ్, జియాలజీ, పర్యావరణ అధ్యయనాల్లో ఉన్నత ప్రమాణాలతో పరిశోధనలు చేపట్టేందుకు ఆధునిక ప్రయోగశాలలు, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉందని తెలిపారు. ఈ నిధులు అందుబాటులోకి వస్తే విశ్వవిద్యాలయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని వివరించారు.

కొత్తగూడెంలో విమానాశ్రయానికి అనుమతులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి కోరారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే గిరిజన ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడటంతోపాటు పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. విమానాశ్రయాల ప్రాధికార సంస్థ పరిశీలించిన స్థలాలపై సాంకేతిక నివేదికను త్వరగా ఖరారు చేసి, పౌర విమానయాన శాఖతో సమన్వయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వే లైన్లకు వేగం పెంచాలి

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న కీలక రైల్వే ప్రాజెక్టులకు త్వరగా అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించేలా రైల్వే శాఖతో సమన్వయం చేయాలని తుమ్మల కోరారు. సత్తుపల్లి–కొవ్వూరు, పెనుబల్లి–కొండపల్లి కొత్త రైల్వే లైన్లకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ మార్గాలు అందుబాటులోకి వస్తే వ్యవసాయ ఉత్పత్తులు, పారిశ్రామిక సరుకుల రవాణా సులభమవుతుందని, ఖమ్మం ప్రాంతానికి ఆంధ్రప్రదేశ్‌తో రైలు అనుసంధానం మెరుగుపడి వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు.

పుష్కరాల నాటికి సారపాక వరకు రైలు

ఇప్పటికే మంజూరైన పాండురంగాపురం–మల్కన్‌గిరి రైల్వే లైన్ పనులను వేగవంతం చేసి, వచ్చే ఏడాది భద్రాచలంలో జరగనున్న గోదావరి పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా భద్రాచలం సమీపంలోని సారపాక వరకు రైల్వే సదుపాయం అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ మార్గం పూర్తయితే గిరిజన, వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతోపాటు, శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి, పుష్కరాలకు వచ్చే భక్తులకు ప్రయాణ సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.

సానుకూలంగా స్పందించిన కిషన్‌రెడ్డి

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా తుమ్మల సమర్పించిన వినతులపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. సంబంధిత శాఖల మంత్రులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి సీఎస్ఆర్ నిధుల మంజూరు అంశంపై తక్షణమే స్పందిస్తూ కోల్ ఇండియా ఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. రాష్ట్రానికి అవసరమైన కేంద్ర సహకారం, కీలక ప్రాజెక్టుల పురోగతిపై జరిగిన ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

హస్తినలో పరిమళించిన తెలంగాణ పూల పండుగ

తెలంగాణ భవన్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ముద్ర, న్యూఢిల్లీ : న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. గౌరీపూజతో ప్రారంభమైన ఈ వేడుకల్లో తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, స్పెషల్ సెక్రటరీ శ్రీ అద్వైత్ కుమార్ సింగ్, ఐఏఎస్ పాల్గొన్నారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల నుంచి తెలంగాణవాసులు తరలివచ్చి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలతో భవన్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఈ సందర్భంగా అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, పల్లె జీవనం, ప్రకృతి పట్ల మనకున్న ప్రేమను బతుకమ్మ పండుగ ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. అందరూ ఒకచోట చేరి, పాటలు పాడుతూ ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని అన్నారు. ఢిల్లీలో ఉన్నప్పటికీ ఇటువంటి వేడుకలు తెలంగాణతో మన అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు.పూలను సేకరించడం నుంచి బతుకమ్మలను అందంగా పేర్చడం వరకు మహిళలు ఎంతో శ్రద్ధ చూపుతారని, తమ ఆటపాటలతో పండుగకు జీవం పోస్తారని అన్నారు. అందమైన బతుకమ్మలను తీసుకువచ్చి వేడుకల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు. పిల్లలకు మన పండుగలు, పాటలు, ఆచారాలను పరిచయం చేయడం ద్వారా సంస్కృతిని తరువాతి తరాలకు అందించాలని సూచించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి, సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా బతుకమ్మ ఆడారు. తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం ప్రసాద వితరణ జరిగింది.

ఆర్టీసీ ఉద్యోగుల
బకాయిల చెల్లింపునకు చర్యలు

- మంత్రి పొన్నం ప్రభాకర్

ముద్ర, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, సంస్థ అభివృద్ధి ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఇటీవల జరిగిన ఆర్టీసీ కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించిన ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూ ఐక్య కూటమి నాయకులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయం సాధించిన నాయకులను మంత్రి అభినందించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను నిర్మాణాత్మకంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను త్వరితగతిన చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే సంస్థకు చెందిన విలువైన భూములను విక్రయించైనా ఉద్యోగుల బకాయిలు చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఈ



విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఉద్యోగుల సీసీఎస్ బకాయిలతో పాటు ఇతర పెండింగ్ సమస్యలను కూడా పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆర్టీసీ విలీన ప్రక్రియలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా అధికారులు, కార్మిక సంఘాల నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్మికుల ప్రయోజనాలను కాపాడుతూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా ఆర్టీసీని మరింత బలోపేతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

అక్రమంగా ఆస్తులు రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ముగ్గురి అరెస్టు



ముద్ర, మేడ్చల్: అక్రమంగా ఆస్తుల్ని రిజిస్ట్రేషన్ చేయిస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) నకిలీ క్లియరెన్స్ పత్రాలు సృష్టించి.. కుత్బుల్లాపూర్ పరిధిలోని జీడిమెట్లలో సర్వే నంబర్ 192, 193లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నట్లు గుర్తించారు. రూ.6 లక్షలు తీసుకొని నకిలీ పత్రాలతో ఈ ముఠా రెండు రిజిస్ట్రేషన్లు చేయించింది. నిందితుల నుంచి నకిలీ డాక్యుమెంట్లు, స్టాంప్ పేపర్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన షూటర్ కెనాన్ చెనయ్‌కు ఘన స్వాగతం

ముద్ర, శంషాబాద్ : జపాన్‌లో ఇటీవల జరిగిన ఆసియా క్రీడల్లో షూటింగ్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన ప్రముఖ షూటర్ కెనాన్ చెనయ్ హైదరాబాద్‌కు చేరుకున్న సందర్భంగా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) ఆధ్వర్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకాన్ని సాధించిన కెనాన్ చెనయ్, అనంతరం న్యూఢిల్లీలో జరిగిన బెరాట కప్ పోటీల్లోనూ తన ప్రతిభను చాటుకున్నారు. వరుసగా రెండు ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పాల్గొని పతకాలు సాధించిన అనంతరం హైదరాబాద్‌కు చేరుకున్న ఆయనకు క్రీడా అధికారులు, షూటింగ్ కోచ్‌లు, యువ క్రీడాకారులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ షూటింగ్ రేంజ్‌లో శిక్షణ పొందుతూ అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధించడం విశేషం. క్రమశిక్షణ, నిరంతర సాధన, పట్టుదలతో ఉన్నత స్థాయికి ఎదిగిన కెనాన్ చెనయ్ విజయం యువ షూటర్లకు స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా



పలువురు పేర్కొన్నారు.ఈ స్వాగత కార్యక్రమంలో తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ డిప్యూటీ డైరెక్టర్ జి. అశోక్ కుమార్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సురేష్ కాలేరు, షూటింగ్ కోచ్ సందీప్‌తో పాటు యువ షూటర్లు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు, కెనాన్ చెనయ్ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.తెలంగాణలో క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తూ, క్రీడాకారులకు మెరుగైన శిక్షణ సదుపాయాలు కల్పించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేలా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ కృషి చేస్తోంది.


సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
శనివారం 17.10.2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశర థి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సాప్ నంబర్ : 9849623744
మెయిల్: mudradaily@gmail.com

ఆహారం తినగానే 'షుగర్ లెవెల్స్'
పెరగడం ప్రమాదకరమా?



రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరుగుతున్నాయని ఆందోళన చెందడం ప్రస్తుతం ఓ ట్రెండ్ గా మారింది. అయితే, ఆహారం తీసుకున్న తర్వాత ఇలా జరగడం సాధారణ శారీరక ప్రక్రియే. కాబట్టి ఈ విషయంలో ఎప్పుడు ఆందోళన చెందాలో, ఎప్పుడు చెందకూడదో తెలుసుకుందాం. గత కొన్నేళ్లలో ఆశ్చర్యకరమైన రెండు పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆరోగ్యంగా ఉన్నవారు సైతం రోజంతా తమ రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకునేందుకు వీలుగా ఉండే పరికరాలను ధరించడం మొదలుపెట్టారు. మరికొందరు తెల్ల రొట్టె, పాస్తా వంటి ప్రాసెస్డ్ కార్బోహైడ్రేట్లను పూర్తిగా తమ ఆహారం నుంచి తొలగిస్తున్నారు.

రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరగకుండా చూసుకోవాలని, వాటిని నిరంతరం పరీక్షించుకోవాలని రచయితలు, పాడ్ కాస్ట్ నిర్వాహకులు, ఆరోగ్యంపై సలహాలిచ్చే సోషల్ మీడియా ఇన్ ఫ్లుయెన్సర్లు ప్రచారం చేస్తున్నారు. వారి వాదన ప్రకారం, రక్తప్రవాహంలో గ్లూకోజ్ గణనీయంగా పెరగడం ప్రమాదకరం. మెటబాలిజం(జీవక్రియ) సంబంధిత వ్యాధులు లేని ఆరోగ్యవంతులు సైతం రక్తంలో చక్కెర స్థాయిలు పెరగనిస్తే హార్మోన్ల అసమతుల్యత, మొటిమలు, మానసిక స్థితిలో మార్పులు వంటి సమస్యలు ఎదురవుతాయని వారు చెబుతున్నారు.అయితే, నిపుణులు ఇప్పుడు ఈ వాదనలను ప్రశ్నిస్తున్నారు. చక్కెర స్థాయుల గురించి ఎప్పుడు ఆందోళన చెందాలి? కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే భోజనం తీసుకున్నంత మాత్రాన దీర్ఘకాలికంగా ఆరోగ్యానికి హాని కలుగుతుందా?

రక్తంలో చక్కెర స్థాయిలు ఎందుకు పెరుగుతాయి?

ప్రాసెస్డ్ చక్కెర, పండ్లు, కార్బోహైడ్రేట్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకుని జీర్ణం చేసుకున్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు సహజంగానే పెరుగుతాయి. కార్బోహైడ్రేట్లు, చక్కెర జీర్ణక్రియలో భాగంగా గ్లూకోజ్ గా విడిపోతాయి. ఈ గ్లూకోజ్ రక్తప్రవాహంలోకి చేరడంతో రక్తంలో చక్కెర స్థాయిలు తాత్కాలికంగా పెరుగుతాయి. అప్పుడు క్లోమగ్రంథి ఇన్సులిన్ అనే హార్మోన్ ను విడుదల చేస్తుంది. ఈ హార్మోన్ రక్తంలోని గ్లూకోజ్ ను శరీర కణాల్లోకి చేరేలా చేస్తుంది. తద్వారా కణాలకు శక్తి అందుతుంది.

ఆహారం మాత్రమే రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచదు. అధిక తీవ్రతతో వ్యాయామం చేస్తున్నప్పుడు అడ్రినలిన్ వంటి హార్మోన్లు కాలేయానికి సంకేతాలిస్తాయి. దీంతో కాలేయం మరింత గ్లూకోజ్ ను రక్తంలోకి విడుదల చేస్తుంది. ఇది కండరాలకు అదనపు శక్తిని అందిస్తుంది. ఫలితంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు తాత్కాలికంగా పెరగవచ్చని అమెరికాలోని కనెక్టికట్ రాష్ట్రం, యేల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ కు చెందిన పిల్లల హార్మోన్ల వ్యాధుల నిపుణురాలు జెన్నిఫర్ షెర్ చెబుతున్నారు.

మధుమేహం ఉన్నవారి శరీరంలో తగినంత ఇన్సులిన్ ఉత్పత్తి కాకపోవచ్చు. లేదా ఇన్సులిన్ సక్రమంగా పనిచేయకపోవచ్చు. ఈ పరిస్థితిని ఇన్సులిన్ రెసిస్టెన్స్ అంటారు. దీంతో ఆహారం తీసుకున్న తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు ప్రమాదకరంగా పెరిగే అవకాశం ఉంటుంది. అలాంటి వారు ఆహారం, వ్యాయామంపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను పర్యవేక్షించుకోవాలి. కొందరికి ఇన్సులిన్ లేదా మెట్ ఫార్మిన్ వంటి మందులు కూడా అవసరమవుతాయి.

గ్లూకోజ్ స్థాయిలు పెరగడం సాధారణమే

ఆరోగ్యవంతుల్లో భోజనం తర్వాత రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగడం సాధారణ శారీరక ప్రతిస్పందన. ప్రతి గ్లూకోజ్ పెరుగుదల హానికరమేనని భావించడం అతిపెద్ద అపోహ అని బ్రిటన్ లోని యూనివర్సిటీ కాలేజ్ లండన్ కు చెందిన పోషకాహార శాస్త్రం, డైటెటిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ అడ్రియన్ బ్రౌన్ అంటున్నారు.

ఇటీవల నేను ఆరు వారాలపాటు అదనపు చక్కెర కలిసిన ఆహారాన్ని పూర్తిగా మానేసి ప్రయోగం చేశాను. అప్పటి నుంచి తీపి పదార్థాలు తిన్నప్పుడు రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయనే విషయంపై మరింత శ్రద్ధ పెట్టాను.

సాధారణంగా భోజనం చేసిన గంట తర్వాత రక్తంలో చక్కెర స్థాయిలు గరిష్ఠ స్థాయికి చేరుకుంటాయి. ఆ తర్వాత రెండు గంటల్లో సాధారణ స్థాయికి తిరిగి వస్తాయి. జీవక్రియ సక్రమంగా పనిచేస్తున్న వ్యక్తిలో గ్లూకోజ్ స్థాయిలు కొద్దిసేపు మాత్రమే పెరిగితే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బ్రౌన్ చెబుతున్నారు. అయితే, రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు ఊహించిన దానికంటే ఎక్కువసేపు పెరిగితే శరీరం గ్లూకోజ్ ను సాధారణ రీతిలో నియంత్రించడం లేదనడానికి అది సంకేతం కావచ్చని షెర్ అంటున్నారు. ఇది ఇన్సులిన్ రెసిస్టెన్స్ సూచన కావచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలు దీర్ఘకాలం అధికంగా ఉండటం వల్ల ఇన్సులిన్ రెసిస్టెన్స్ ఏర్పడే అవకాశం ఉంది. చివరకు ఇది ప్రీడయాబెటిస్, టైప్ 2 మధుమేహానికి దారితీయవచ్చు. కొందరు మధుమేహ రోగుల్లో రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నిరంతరం అధికంగా ఉండటం వల్ల నరాలు, కళ్లకు నష్టం కలగడంతో పాటు గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలు తలెత్తవచ్చు అయితే, రక్తంలో గ్లూకోజ్ అధికంగా ఉండటం నేరుగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ కు దారితీస్తుందని చెప్పేందుకు తగిన ఆధారాలు లేవని కొందరు నిపుణులు అభిప్రాయపడుతున్నారు. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ ఆహారం తీసుకున్నప్పుడు, అదనపు కేలరీలు కొవ్వుగా మారుతాయని బ్రిటన్ లోని ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన డైటీషియన్, సీనియర్ పరిశోధకురాలు నికోలా గెస్ వివరిస్తున్నారు. ఇలా బరువు పెరగడం టైప్ 2 మధుమేహానికి ఒక ప్రమాద కారకమని ఆమె చెబుతున్నారు

నిరంతర గ్లూకోజ్ పర్యవేక్షణ పరికరాల వినియోగం

మధుమేహం ఉన్నవారు ఇప్పటికే క్రమం తప్పకుండా రక్తంలో చక్కెర స్థాయిలను పరీక్షించుకుంటున్నారు. ఇందుకోసం రోజంతా గ్లూకోజ్ స్థాయిలను కొలిచే కంటిన్యూస్ గ్లూకోజ్ మానిటర్లు (సీజీఎంలు) అనే పరికరాలను కొందరు ఉపయోగిస్తున్నారు.ఇప్పుడు మధుమేహం లేని ఆరోగ్యవంతులు కూడా ఈ పరికరాలు ఉపయోగిస్తున్నారు. అయితే, మధుమేహం లేనివారికి ఇవి అవసరం లేదని కొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధుమేహం లేని వ్యక్తులపై నిర్వహించిన ఒక అధ్యయనంలో, వారి రక్తంలో చక్కెర స్థాయిలు 96 శాతం సమయం ఆరోగ్యకరమైన పరిధిలోనే ఉన్నట్లు తేలింది. ఈ పరికరాలు ఆహారపు అలవాట్లలో హానికరమైన మార్పులకు ప్రేరేపించడంతో పాటు ఆరోగ్యంపై తప్పుడు అభిప్రాయాలను కలిగించవచ్చని మరికొందరు హెచ్చరిస్తున్నారు. పైగా,ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను వాస్తవాని కంటే ఎక్కువగా చూపించే అవకాశం ఉంది. సీజీఎంలు మధుమేహం లేని వ్యక్తుల ఆరోగ్య ఫలితాలను మెరుగుపరుస్తాయని నిరూపించే స్థిరమైన, నాణ్యమైన ఆధారాలు లేవని బ్రౌన్, ఆయన సహచరులు ఇటీవల నిర్వహించిన సమీక్షలో పేర్కొన్నారు. అయితే, టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి ఈ పరికరాలు ఉపయోగపడే అవకాశం ఉందని షెర్ చెబుతున్నారు.

అడవుల్లో మంటలు.. దేశాలకు ఊపిరి ముప్పు!

కాళిమంతన్ కార్చిచ్చుతో ఆగ్నేయాసియా ఉక్కిరిబిక్కిరి!
సింగపూర్, మలేషియాలో ప్రమాదకర స్థాయికి వాయు కాలుష్యం

మంటలు చెలరేగింది ఇండోనేషియాలో.. కానీ ఊపిరాడక అల్లాడుతున్నది పొరుగుదేశాల ప్రజలు! ఇండోనేషియాలోని కాళిమంతన్ , సుమత్రా ప్రాంతాల్లో నెలల తరబడి కొనసాగుతున్న అటవీ మంటలు ఆగ్నేయాసియా దేశాలకు పెను పర్యావరణ ముప్పుగా పరిణమించాయి. అడవులను, వ్యవసాయ భూములను దహనం చేయడంతో వెలువడుతున్న దట్టమైన పొగ సముద్రాలు, దేశ సరిహద్దులను దాటి సింగపూర్ , మలేషియా, ఫిలిప్పీన్స్ , బ్రూనై తదితర దేశాల వైపు వ్యాపిస్తోంది. ప్రధాన నగరాల్లో ఆకాశహర్మ్యాలు పొగమంచులో కనుమరుగవుతుండగా, ప్రజలు స్వచ్ఛమైన గాలి కోసం తహతహలాడుతున్నారు. వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో పలు ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేస్తున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వాలు అత్యవసర చర్యలు చేపడుతున్నాయి.

కాళిమంతన్‌లో కార్చిచ్చు.. అదుపు తప్పుతున్న కాలుష్యం

ఇండోనేషియాలోని బోర్నియో ద్వీపంలో ఉన్న కాళిమంతన్ ప్రాంతంతో పాటు సుమత్రాలో విస్తృతంగా అటవీ మంటలు చెలరేగుతున్నాయి. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన తీవ్రమైన పొడి వాతావరణం ఈ మంటలకు మరింత ఆజ్యం పోస్తోంది. వ్యవసాయ భూముల విస్తరణ, పామాయిల్ తోటల కోసం కొన్ని ప్రాంతాల్లో అనుసరిస్తున్న చెట్ల నరికివేత, భూమిని కాల్చే పద్ధతులు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయని పర్యావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

ముఖ్యంగా పీట్ భూముల్లో మంటలు భూగర్భంలోనూ కొనసాగుతుండటంతో వాటిని పూర్తిగా ఆర్పివేయడం కష్టతరమవుతోంది. అక్టోబర్ 14న సెంట్రల్ కాళిమంతన్ లో వాయు కాలుష్య సూచీ 1,200 దాటడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. అక్కడ ప్రమాదకర స్థాయి 300 కాగా, నమోదైన కాలుష్యం దానికి నాలుగు రెట్లకుపైగా చేరింది.

ఇండోనేషియాలోని ఏడు ప్రావిన్సుల్లో అక్టోబర్ 13 నాటికి శ్వాసకోశ సంబంధిత అనారోగ్య కేసులు 2,83,270కు చేరినట్లు అధికారిక సమాచారం వెల్లడిస్తోంది.

సింగపూర్‌లో ఊపిరి తీసుకోవడమే సమస్య!

అత్యంత పరిశుభ్రమైన నగరాల్లో ఒకటిగా పేరొందిన సింగపూర్ ప్రస్తుతం పొగ కాలుష్యంతో సతమతమవుతోంది. అక్టోబర్ 14న దేశంలోని పశ్చిమ ప్రాంతంలో గంటవారీ సూక్ష్మ ధూళికణాల (పీఎం 2.5) సాంద్రత ఒక దశలో ఘనపు మీటరుకు 284 మైక్రోగ్రాములకు చేరింది. ఇది ఆ దేశ అత్యధిక కాలుష్య హెచ్చరిక స్థాయికి చెందినది.


సింగపూర్ జాతీయ పర్యావరణ సంస్థ (ఎన్ఈఏ) అధికారిక ప్రకటన ప్రకారం, అదే రోజు సాయంత్రం నాలుగు గంటలకు 24 గంటల కాలుష్య సూచీ (పీఎస్ఐ) 118 నుంచి 168 మధ్య నమోదైంది. రాబోయే రోజుల్లో ఇది మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వం 28 శాఖల సమన్వయంతో హేజ్ టాస్క్ ఫోర్స్ ను సిద్ధం చేసింది. అక్టోబర్ 14 నుంచి వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు సహా అర్హులైన వర్గాలకు ఎన్ 95 మాస్కుల పంపిణీని దశలవారీగా ప్రారంభించింది. కమ్యూనిటీ కేంద్రాల్లో పొగ నుంచి ఉపశమనం పొందేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేసింది.

అంతేకాకుండా అక్టోబర్ 12 నుంచే పొగ కాలుష్య సంబంధిత వ్యాధులకు వైద్య చికిత్స రాయితీలను అమల్లోకి తెచ్చింది. పరిస్థితిని బట్టి పాఠశాలల్లో బహిరంగ కార్యక్రమాలను పరిమితం చేయాలని సూచిస్తోంది.

మలేషియాలో పాఠశాలల మూసివేత

ఇండోనేషియా అటవీ మంటల ప్రభావం మలేషియాపై తీవ్రంగా పడుతోంది. రాజధాని కౌలాలంపూర్ తో పాటు జోహోర్ , మెలాకా, నెగెరి సెంబిలాన్ , సెలాంగోర్ , పహాంగ్ ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణించింది. అక్టోబర్ 14 మధ్యాహ్నం దేశంలోని 68 కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల్లో 28 కేంద్రాలు అనారోగ్యకరమైన వాయు నాణ్యతను నమోదు చేశాయి. జోహోర్ లోని పాసిర్ గుడాంగ్ లో కాలుష్య సూచీ 179కి చేరింది.

విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 14న జోహోర్ , మెలాకా, నెగెరి సెంబిలాన్ రాష్ట్రాల్లో పాఠశాలలను మూసివేశారు. మరికొన్ని రాష్ట్రాల్లో ఎంపిక చేసిన జిల్లాల్లోనూ ఇదే నిర్ణయం తీసుకున్నారు. విద్యార్థులకు ఇంటి నుంచే పాఠాలు బోధించే ఏర్పాట్లు చేశారు. గాలి నాణ్యత మెరుగుపడిన కొన్ని ప్రాంతాల్లో మరుసటి రోజు నుంచి పాఠశాలలను పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు.



పొగ ప్రభావాన్ని తగ్గించేందుకు మలేషియా ప్రభుత్వం కృత్రిమ వర్షం కురిపించే క్లౌడ్ సీడింగ్ కార్యక్రమాన్ని చేపట్టింది. అక్టోబర్ 13న జోహోర్ లో పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ప్రత్యేక విమానాల సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇండోనేషియాకు అగ్నిమాపక సహాయం అందించేందుకు కూడా ముందుకొచ్చింది.

ఫిలిప్పీన్స్‌కూ చేరిన విషపొగ

ఇండోనేషియా నుంచి వెలువడిన పొగ ఫిలిప్పీన్స్ దక్షిణ ప్రాంతాలనూ ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా మిందనావో ద్వీపంలోని దావావో ప్రాంతంలో గాలి నాణ్యత క్షీణించినట్లు ఆ దేశ పర్యావరణ శాఖ అక్టోబర్ 13న వెల్లడించింది.

ప్రజలు అత్యవసరం కాని ప్రయాణాలను తగ్గించాలని, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధిగ్రస్తులు వీలైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని సూచించారు. గాలి నాణ్యతను నిరంతరం పర్యవేక్షిస్తూ ఆరోగ్య హెచ్చరికలను జారీ చేస్తున్నారు.

తూర్పు తైమూర్‌లోనూ విద్యాసంస్థలపై ఆంక్షలు

పొగ కాలుష్య ప్రభావం తూర్పు తైమూర్ (టిమోర్ – లెస్టే) వరకు విస్తరించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని అక్టోబర్ 15 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యక్ష తరగతులను నిలిపివేయనున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. పిల్లలను ఇళ్లలో ఉంచాలని, అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు తగిన శ్వాస రక్షణ చర్యలు పాటించాలని సూచించింది.

మంటలను ఆర్పేందుకు ఇండోనేషియా భారీ ప్రయత్నం

పొరుగుదేశాల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో అటవీ మంటల అదుపునకు అదనపు వనరులను సమీకరించాలని ఆదేశించారు. దేశవ్యాప్తంగా 69 వేల మందికిపైగా అగ్నిమాపక, సహాయక సిబ్బందిని రంగంలోకి దించారు.ప్రత్యేక రసాయనాలను ఉపయోగించి మంటలను అదుపు చేసే విధానాలనూ పరీక్షిస్తున్నారు.

అయితే దట్టమైన పొగ కారణంగా విమానాల ద్వారా నీటిని చల్లే కార్యక్రమాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూగర్భంలో మండుతున్న పీట్ భూముల మంటలు మరోసారి బయటపడే ప్రమాదం ఉండటంతో సహాయక చర్యలు ఆశించిన స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. వర్షపాతం పెరిగితేనే పరిస్థితి గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

ఆసియాన్ దేశాల మధ్య పెరుగుతున్న ఒత్తిడి

అటవీ మంటల నుంచి వెలువడే పొగ దేశ సరిహద్దులు దాటి వ్యాపించడాన్ని అరికట్టేందుకు ఆసియాన్ దేశాలు 2002లోనే అంతర్జాతీయ ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. అయినప్పటికీ ఈ సమస్య పునరావృతమవుతుండటం ఆ ఒప్పందం అమలుపై ప్రశ్నలను లేవనెత్తుతోంది.

ఇండోనేషియాలో మంటలను అదుపు చేసేందుకు సింగపూర్ , మలేషియా సహాయం అందించేందుకు ముందుకొచ్చాయి. మరోవైపు మలేషియాలో కొందరు ప్రజాప్రతినిధులు మరింత కఠినమైన దౌత్యపరమైన చర్యలు అవసరమని డిమాండ్ చేస్తున్నారు.

నవంబర్ లో జరగనున్న ఆసియాన్ విదేశాంగ మంత్రుల సమావేశంలో సరిహద్దులు దాటుతున్న పొగ కాలుష్య సమస్యను చర్చించనున్నట్లు ప్రస్తుతం ఆసియాన్ అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న ఫిలిప్పీన్స్ ప్రకటించింది.

పర్యావరణ విధ్వంసానికి మూల్యం చెల్లిస్తున్న ప్రజలు!

అడవులను దహనం చేయడం ఒక దేశ అంతర్గత వ్యవహారంగా కనిపించవచ్చు. కానీ ఆ మంటల నుంచి వెలువడే విషపూరిత ధూళికణాలు సరిహద్దులను గుర్తించవు. ఒకచోట జరిగే పర్యావరణ విధ్వంసం మరో దేశంలోని ప్రజల ఆరోగ్యాన్ని, విద్యను, ఉపాధిని ప్రభావితం చేస్తోంది. ప్రస్తుతం ఆసియాన్ దేశాలు ఎదుర్కొంటున్న ఈ సంక్షోభం కేవలం పొగ కాలుష్యానికి సంబంధించినది మాత్రమే కాదు. ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రకృతి వనరులను దెబ్బతీస్తే సమాజం చెల్లించాల్సిన మూల్యం ఎంత తీవ్రంగా ఉంటుందో తెలియజేసే హెచ్చరిక.

మంటలను ఆర్పడం తాత్కాలిక పరిష్కారమే. అడవుల విధ్వంసాన్ని అరికట్టడం, అక్రమ భూదహనాన్ని నిరోధించడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం ద్వారానే శాశ్వత పరిష్కారం సాధ్యం. లేకపోతే ఒక దేశంలో రాజుకున్న నిప్పు.. అనేక దేశాల ప్రజల ఊపిరిని ఇలాగే బందీ చేస్తూనే ఉంటుంది!



నాగేశ్వర రావు బల్లెడ
సీనియర్ జర్నలిస్ట్
హైదరాబాద్

నవరాత్రి ఉపవాసంలో గ్యాస్, కడుపు ఉబ్బరంతో ఇబ్బందా?

ఈ చిన్న మార్పులతో వెంటనే రిలీఫ్!

నవరాత్రుల సమయంలో చాలామంది దుర్గాదేవిపై భక్తితో ఉపవాసాలు పాటిస్తుంటారు. కొందరు రోజంతా పండ్లు, పాలు తీసుకుంటే.. మరికొందరు సగ్గుబియ్యం, ఆలుగడ్డలు, సగ్గుబియ్యం కిచిడీ, పూరీలు వంటి ఉపవాస ఆహారాలను తింటారు. అయితే ఉపవాసం మొదలుపెట్టిన కొన్ని రోజులకే కడుపు ఉబ్బరం, గ్యాస్, తేన్పులు, కడుపులో బరువుగా అనిపించడం వంటి సమస్యలు ఎదురవుతుంటాయి. దీంతో పూజలు, రోజువారీ పనులు చేసుకోవడం కూడా అసౌకర్యంగా మారుతుంది. అసలు ఉపవాస సమయంలోనే ఈ సమస్యలు ఎందుకు వస్తాయి? వీటిని తగ్గించుకోవడానికి ఆహారంలో ఎలాంటి మార్పులు చేసుకోవాలి? నిజానికి ఉపవాసం ఉండటం ఒక్కటే గ్యాస్ సమస్యకు కారణం కాదు. రోజువారీ ఆహారపు అలవాట్లు ఒక్కసారిగా మారడం, ఎక్కువసేపు ఏమీ తినకుండా ఉండి తర్వాత ఒకేసారి ఎక్కువగా తినడం, నూనెలో వేయించిన పదార్థాలను అధికంగా తీసుకోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటి కారణాలు జీర్ణ అసౌకర్యానికి దారితీయవచ్చు. కొన్ని సులభమైన అలవాట్లను పాటించడం ద్వారా ఈ ఇబ్బందులను తగ్గించుకోవడానికి ప్రయత్నించవచ్చు.

ఉపవాసం ఉన్నప్పుడు చాలా గంటల పాటు ఆహారం తీసుకోకుండా ఉండి, ఆకలి ఎక్కువైన తర్వాత ఒకేసారి భారీగా తినడం వల్ల కడుపు నిండినట్లు, ఉబ్బరంగా అనిపించవచ్చు. అందుకే మీ ఉపవాస నియమాలకు అనుగుణంగా తక్కువ పరిమాణాల్లో ఆహారం తీసుకోవడం మంచిది. రోజంతా ఆకలితో ఉండి రాత్రి ఎక్కువగా తినే అలవాటును తగ్గించండి. మీ శరీరానికి సరిపడే ఆహారాన్ని ఎంచుకుని, భోజన పరిమాణాన్ని నియంత్రించండి.



నవరాత్రి ఉపవాస సమయంలో ఆలుగడ్డ పూరీలు, పకోడీలు, సగ్గుబియ్యం వడలు వంటి వేయించిన పదార్థాలను చాలామంది ఎక్కువగా తింటారు. అయితే వీటిలో కొవ్వు అధికంగా ఉండటం వల్ల కొందరిలో జీర్ణక్రియ నెమ్మదించి కడుపు నిండినట్లు అనిపించవచ్చు. వీలైనంత వరకు తక్కువ నూనెతో చేసిన వంటకాలను ఎంచుకోండి. ఉడికించిన పదార్థాలు, తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని మీ ఉపవాస పద్ధతికి అనుగుణంగా తీసుకోవచ్చు.

ఉపవాస సమయంలో ఆహారంతో పాటు నీటి తీసుకోవడం కూడా తగ్గిపోతుంది. దీనివల్ల డీహైడ్రేషన్, మలబద్ధకం వంటి సమస్యలు ఏర్పడి కడుపులో అసౌకర్యం పెరగవచ్చు. ఉపవాస నియమాలు అనుమతిస్తే రోజంతా కొద్దికొద్దిగా నీరు తాగండి. దాహం వేసే వరకు వేచి ఉండకుండా నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం మంచిది. అయితే వైద్యులు ద్రవాల పరిమాణాన్ని పరిమితం చేయాలని సూచించినవారు తమ వైద్యుల సలహాను పాటించాలి.

తొందరగా తినేటప్పుడు ఆహారంతో పాటు గాలి కూడా కడుపులోకి వెళ్లే అవకాశం ఉంటుంది. ఇది కొందరిలో తేన్పులు, ఉబ్బరం వంటి సమస్యలకు కారణం కావచ్చు. అందుకే ఆహారాన్ని నెమ్మదిగా, బాగా నమిలి తినండి. తినేటప్పుడు తొందరపడకుండా ప్రశాంతంగా ఉండండి. అలాగే సోడా, కార్బొనేటెడ్ పానీయాలు తీసుకోవడం తగ్గించండి. ఇవి కడుపులో గ్యాస్ పెరిగినట్లు అనిపించేలా చేయవచ్చు.

జీలకర్ర నీరు తాగవచ్చా?

జీలకర్రను భారతీయ వంటల్లో సాధారణంగా ఉపయోగిస్తారు. కొందరు జీలకర్ర వేసి మరిగించిన నీటిని కూడా తాగుతుంటారు. అయితే జీలకర్ర నీరు గ్యాస్‌ను ఖచ్చితంగా తగ్గిస్తుందని చెప్పడానికి తగిన శాస్త్రీయ ఆధారాలు పరిమితంగా ఉన్నాయి. మీకు అలర్జీ లేదా ఇతర వైద్యపరమైన పరిమితులు లేకపోతే, ఉపవాస నియమాలకు అనుగుణంగా సాధారణ పానీయంగా తీసుకోవచ్చు. ఇది వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. ఏదైనా పానీయం తీసుకున్న తర్వాత అసౌకర్యం పెరిగితే దాన్ని ఆపేయండి.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 17.10.2026
www.mudranews.in | @mudranews

గుండె ఆరోగ్యానికి అనుకూలమైన అల్పాహారం!

ఇడ్లీలను ఆవిరిపై ఉడికించడం వల్ల అదనపు నూనె అవసరం ఉండదు. ఉప్పు, అధిక కొవ్వు పదార్థాలు పరిమితంగా తీసుకుంటూ, కూరగాయలతో కూడిన సాంబార్ ను జతచేస్తే సమతుల్య ఆహారంలో భాగంగా ఇడ్లీలను తీసుకోవచ్చు.



నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బండి రమేష్

ముద్ర, కూకట్ పల్లి :

టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ బండి రమేష్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భరత్‌నగర్ కాలనీలో నాగిరెడ్డి, మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో తూము మనోజ్, బాలాజీనగర్‌లో కృష్ణ రాజ్‌పుత్ ఆహ్వానం మేరకు నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆయన హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ దుర్గామాత ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాలు ఆధ్యాత్మికతకు, సామాజిక ఐకమత్యానికి ప్రతీకలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా ప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.



యువ క్రీడాకారులకు వనపర్తి ఛాంపియన్స్ కప్ ఎంతో ఉపయోగం

- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి

ముద్ర, వనపర్తి :

మీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసేందుకు వనపర్తి చాంపియన్స్ కప్–2026 ఎంతో ఉపయోగపడుతుందని రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎస్పీ డి. సునీతారెడ్డితో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు.

జిల్లాలోని 15 మండలాల క్రీడాకారులు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, టగ్ ఆఫ్ వార్, క్యారమ్స్, చెస్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని శివసేనారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ అత్యధిక ట్రోఫీలు సాధించిన మండలానికి చాంపియన్స్ ట్రోఫీ అందజేస్తామని తెలిపారు. ఎస్పీ సునీతారెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.





దసరా, బతుకమ్మ శుభాకాంక్షలు..

- దొడ్ల వెంకటేష్ గౌడ్
- మహిళా నాయకురాళ్లకు చీరల పంపిణీ..

ముద్ర, కూకట్ పల్లి/శేరిలింగంపల్లి:

దసరా, బతుకమ్మ పండుగలను మహిళలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆల్విన్ కాలనీ, శంషిగూడ డివిజన్ల మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆకాంక్షించారు. ఆయన ఆధ్వర్యంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ చేతుల మీదుగా మహిళా నాయకురాళ్లకు బతుకమ్మ సారెగా చీరలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా పండుగలు జరుపుకోవాలనే ఉద్దేశంతో చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని అంబీర్ చెరువు కట్ట, శివమ్మ కాలనీ రామాలయం వద్ద బతుకమ్మ వేడుకల కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రజల సహకారంతో ఈ ఏడాది కూడా పండుగలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ నియోజకవర్గ మహిళలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.



'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్ ప్రెస్' రథం ప్రారంభం



- జనసేనలో చేరిన పలువురు ప్రముఖులు

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, పట్టభద్రుల సమస్యలను తెలుసుకోవడం, యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించడం లక్ష్యంగా పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల ప్రచారం కోసం రూపొందించిన 'జనసేన గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' ప్రచార రథాన్ని శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన ప్రారంభించారు. ఇదే సందర్భంగా తెలంగాణకు చెందిన వివిధ రంగాల ప్రముఖులు జనసేన పార్టీలో చేరారు.

పట్టభద్రుల సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి జనసేన పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు పోటీ చేస్తున్న నేపథ్యంలో, ఆయన విజయాన్ని ఆకాంక్షిస్తూ పవన్ కళ్యాణ్ పలు సూచనలు చేశారు. పట్టభద్రుల సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతోపాటు, వారి అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకునేలా కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా ప్రారంభించిన 'గ్రాడ్యుయేట్ ఎక్స్‌ప్రెస్' రథం కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితం కాకూడదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను నిరంతరం తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను సేకరించి, ప్రజాసేవకు ఉపయోగపడే వేదికగా ఈ వాహనం కొనసాగాలని ఆయన పేర్కొన్నారు. పట్టభద్రుల సమస్యలు, యువత ఆకాంక్షలు, వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశాలపై నిరంతరంగా దృష్టి సారించేందుకు ఈ కార్యక్రమం దోహదపడాలన్నది పార్టీ ఉద్దేశంగా వెల్లడైంది.

జనసేనలోకి ప్రముఖులు

మరోవైపు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నాయకత్వం, ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ అనుసరిస్తున్న విధానాల పట్ల ఆకర్షితులై తెలంగాణకు చెందిన పలువురు ప్రముఖులు జనసేనలో చేరారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, సామాజిక సేవకులు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, క్రీడాకారులు, యువత, డిజిటల్ మీడియా ప్రతినిధులు తదితరులు పార్టీలో చేరినట్లు జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం వెల్లడించింది.



మోకిల పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన డీసీపీ

ముద్ర, చేవెళ్ల:

శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసులు చిత్తశుద్ధితో పనిచేయాలని చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం సూచించారు. మండలంలోని మోకిల పోలీస్ స్టేషను ఆయన శుక్రవారం సందర్శించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించారు. కేసుల పూర్వపరాలను అడిగి తెలుసుకున్నారు. దసరా పండుగ సమీపిస్తున్నందున ప్రజలు సొంత ఊర్లకు వెళ్లే అవకాశాలు ఉన్నందున వారికి ముందస్తు జాగ్రత్తలు వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. పండుగ వేళ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఏసిపి కిషన్, మోకిల ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై సురేష్ గౌడ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

దేవి నవరాత్రుల వేడుకల్లో జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్

ముద్ర కూకట్ పల్లి:

నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ కాలనీలో దేవి నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కాలనీలోని పలు దుర్గ మాత మండపాలను జనసేన పార్టీ తెలంగాణ జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ సందర్శించారు. మండప నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆయన, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు, నిర్వాహకులు శ్రీ ప్రేమకుమార్‌ను శాలువాతో సత్కరించి ఘన స్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, వర్రే నాగరాజు, శ్రీనివాస గోవిందా, దాసరి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



కరువుపై ముందస్తు చర్యల్లో ప్రభుత్వం విఫలం

- కల్వకుంట్ల కవిత

ముద్ర, హైదరాబాద్:

రాష్ట్రంలో కరువును ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందించడంతోపాటు వారి కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారంపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, ఉపాధి హామీ పథకం కింద పని దినాలు పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు.



నవంబర్ నెలాఖరు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలని, మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతులను వచ్చే వర్షాకాలంలోగా చేపట్టాలని కవిత కోరారు. కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్యలను ముందుగానే

యాదాద్రి పవర్ ప్లాంట్‌పై ప్రశ్నలు

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో కొన్ని విభాగాలను ప్రైవేటీకరించే ప్రయత్నం జరుగుతోందని కవిత ఆరోపించారు. పవర్ మ్యాక్స్ కంపెనీతో ప్రభుత్వానికి ఉన్న ఒప్పందాల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నీటి కొరతకు చెరువుల ఆక్రమణలు కూడా కారణమని పేర్కొంటూ, చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

కరువు పరిస్థితులపై అఖిలపక్ష సమావేశాన్ని ముందుగానే నిర్వహించి ఉండాల్సిందని కవిత అభిప్రాయపడ్డారు. రైతులకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. బొగ్గు కొనుగోలు ఒప్పందాల విచారణ అంశంలో కేటీఆర్ వైఖరిపైనా ఆమె విమర్శలు చేశారు.

బతుకమ్మ సంబరాల్లో ఎస్పీ సునీత రెడ్డి

ముద్ర, వనపర్తి :

వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి మహిళా పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని ఆడిపాడారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, కోలాటాలు ఆడుతూ మహిళా పోలీసులు ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్పీ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా, మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటూ విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఏఆర్ వీరారెడ్డి, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, డీఎస్పీ గిరిబాబు, సీఐలు ఓడీ రమేష్, రత్నం, ఆర్ఐలు అప్పలనాయుడు, శ్రీనివాసకుమార్, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.



చంద్రపురి కాలనీ డివిజన్ కమిటీ నియామకం

- ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కమిటీ

ముద్ర, జవహర్ నగర్:

చంద్రపురి కాలనీ డివిజన్ పూర్తిస్థాయి కమిటీని నియమిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులను జారీ చేసింది. మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఈ నియామక పత్రాన్ని బోడుప్పల్ లోని జిల్లా కార్యాలయంలో జవహర్ నగర్ మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్త సమక్షంలో డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ కు అందించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ డివిజన్ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ తో పలుమార్లు సంప్రదింపులు జరిపిన కమిటీ సభ్యుల నియామకంపై తుది నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు. నూతనంగా ఏర్పాటైన కమిటీలో ఉపాధ్యక్షులుగా గొడుగు వేణు, బింగి సతీష్ గౌడ్, గోనె చిట్టి బాబు, ప్రధాన కార్యదర్శులుగా బూడిద వెంకటేష్, నరిశెట్టి కిరణ్, జోగి సునీత, చిత్యాల మాధవరెడ్డి, కార్యదర్శులుగా మొగిలిపాక వెంకటేష్, దోయ శ్రీనివాస్, రేసు యాదగిరి యాదవ్, కోట్ల చెన్నారెడ్డి, రంగ శ్రీమాన్ గుప్తా, అధికార ప్రతినిధి మొగిలిపాక పరశురాం, కోశాధికారి నంగునూరి అశోక్ గుప్త, కార్యవర్గ సభ్యులుగా కర్ర కిషోర్, వంగల భాస్కర్ గౌడ్, మామిడాల రామ్‌రెడ్డి, ప్రభు గౌడ్, కొండర్తి నరేష్ లు నియమితులయ్యారు. నూతనంగా ఏర్పాటైన కమిటీ సభ్యులకు జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు. క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేలా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ కార్పొరేటర్ లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వర్షాలు సమృద్ధిగా కురవాలి

–పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

ముద్ర కూకట్పల్లి/శేరిలింగంపల్లి :

నాటిన పంటలు పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఈద్గా వద్ద ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో సమృద్ధిగా వర్షా లు కురవాలని ప్రత్యేక ప్రార్థన కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్ నినో ప్రభావం, వాతావరణ మార్పుల వల్ల ఈ ఏడాది సరైన వర్షాలు లేక తీవ్ర కరువు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ప్రజా శ్రేయస్సును కోరుతూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు.



అనారోగ్యంతో శంకర్ పల్లి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మృతి

ముద్ర, చేవెళ్ల:

శంకర్ పల్లి పురపాలిక మాజీ వైస్ చైర్మన్ భానూరు వెంకటరామిరెడ్డి అనారోగ్యంతో శుక్రవారం ఉదయం నగరంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. వెంకట్రామిరెడ్డి మృతి వార్త తెలుసుకున్న చేవెళ్ల మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లాలోని పలువురు నాయకులు ఆయన ఇంటి వద్దకు చేరుకొని పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. స్థానిక మున్సిపల్ ఛైర్మెన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి, శంకర్ పల్లి పిఏసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బీర్ల సర్సింహా, మాజీ చైర్మను శశిదర్ రెడ్డి తదితరులు వెంకట్ రామ్ రెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

'బీఎస్పీతోనే బహుజనులకు భవిష్యత్తు'

ముద్ర కూకట్పల్లి :

బీఎస్పీతోనే బహుజనుల జీవితాలకు భద్రత, భవిష్యత్తు లభిస్తాయని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాంకృష్ణ అన్నారు. వికారాబాద్ జిల్లా అధ్యక్షులు కట్టెల మల్లేశం అధ్యక్షతన శుక్రవారం పట్టణంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో బీఎస్పీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీరాంకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికీ పార్టీ సిద్ధాంతాలను చేర్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బీఎస్పీ 4వ జోన్ ఇన్‌చార్జ్ అంతటి నాగన్న, చేవెళ్ల పార్లమెంట్ ఇన్‌చార్జ్ సయ్యద్ అమీర్, జిల్లా ఉపాధ్యక్షులు చెట్టుకింద ఇసువప్ప, ప్రధాన కార్యదర్శి చెన్నప్ప, కార్యదర్శి కృష్ణంరాజు, మహిళా విభాగం కన్వీనర్ సౌమ్య, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 17.10.2026
www.mudranews.in | @mudranews

కడుపు నిండిన భావనకు సాంబార్‌తో ఇడ్లీ!

ఇడ్లీలతో పాటు ప్రోటీన్, ఫైబర్ కలిగిన పప్పులు, కూరగాయలతో చేసిన సాంబార్ తీసుకుంటే పోషకాలు పెరుగుతాయి. ఇవి కడుపు నిండిన భావన ఎక్కువసేపు ఉండటానికి సహాయపడవచ్చు. అల్పాహారంలో సమతుల్యత కోసం ఇది మంచి కలయిక.



ఎల్ నినో ప్రభావంపై అప్రమత్తంగా ఉండాలి

- వికాస్ రాజ్

ముద్ర, హైదరాబాద్: ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ ఆదేశించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో తాగునీటి సరఫరా, వ్యవసాయం, విద్యుత్, నీటిపారుదల, పశుగ్రాసం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. నీటి కొరత తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని సూచించారు. భూగర్భ జలాల సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

రాహుల్ తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు

- కిషన్‌రెడ్డి



ముద్ర, హైదరాబాద్: రాజ్యాంగం ఇచ్చిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్ష పార్టీలు దుర్వినియోగం చేస్తున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. దేశంలో అరాచకం సృష్టించేందుకు, కేంద్రాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని ఆక్షేపించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అవమానించేలా రాహుల్‌గాంధీ వ్యవహరిస్తున్నారని అన్నారు. '' 2029 వరకు ప్రధానిగా మోదీ ఉండాలని ప్రజలు తీర్పునిచ్చారు. బంగ్లాదేశ్, శ్రీలంకలో చేసినట్లు ప్రభుత్వాన్ని కూల్చుతామని దింపుడుకల్లం ఆశలు పెట్టుకున్నారు. ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభంలో ఉంటే.. భారత్ మాత్రం అభివృద్ధి చెందుతోంది. రాహుల్ గాంధీ తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదు'' అని కిషన్‌రెడ్డి అన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నాం..

*** విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఉంటే సమాచారం ఇవ్వండి..**



*** సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన విద్యుత్ శాఖ ఎస్ఈ విజయేందర్ రెడ్డి..**

ముద్ర చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల పరిధిలోని సుందరగిరి,కొండాపూర్ గ్రామాల్లో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు.ఈ పర్యటనలో విద్యుత్ శాఖ ఎస్ఈ విజెందర్ రెడ్డి,డీఈ తిరుపతి,ఇందుర్తి ఏఈ అన్వేష్ లు కలిసి స్థానిక పంట పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి, విద్యుత్ సరఫరా తీరును పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు పొలాల వద్ద ఉన్న రైతులతో నేరుగా మాట్లాడారు.వ్యవసాయానికి అందుతున్న విద్యుత్ సరఫరాపై ఆరా తీస్తూ, రైతులకు ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పొలాల వద్ద ఉన్న ట్రాన్స్ఫార్మర్లను సైతం పరిశీలించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు.అనంతరం అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని రైతులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేవని,సరఫరా సజావుగా సాగుతోందని స్పష్టం చేశారు.రైతులకు విద్యుత్ పరంగా ఎలాంటి అంతరాయాలు లేదా సమస్యలు ఎదురైనా,వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారుల లేదా లైన్ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని,సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అధికారులు రైతులకు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిబ్బంది,స్థానిక రైతులు పాల్గొన్నారు.

17న భూభారతి రీ-సర్వే అవగాహన సదస్సులు

*** విజయవంతం చేయాలన్న తహసిల్దార్ కనకయ్య..**



ముద్ర చిగురుమామిడి: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ–సర్వే కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముదిమాణిక్యం,రామంచ గ్రామాలను ఎంపిక చేసినట్లు తహసిల్దార్ కనకయ్య తెలిపారు.ఈ నేపథ్యంలో ఈనెల 17న శనివారం ఉదయం 10గంటలకు,మధ్యాహ్నం 12:30గంటలకు ఆయా గ్రామాల రైతు వేదిక,గ్రామ పంచాయతీ కార్యాలయాల నందు భూ భారతి భూముల రీ–సర్వేపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించనున్నారు.గ్రామ సర్పంచ్‌ల ఆధ్వర్యంలో జరగనున్న ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా కరీంనగర్ జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ కిషన్ రావు,స్థానిక తహశీల్దార్,డీఐ,మండల సర్వేయర్ హాజరుకానున్నారు.ఈ సందర్భంగా వారు రైతులకు భూ భారతి రీ–సర్వే యొక్క ముఖ్య ఉద్దేశాలను,దాని వల్ల చేకూరే ప్రయోజనాలను క్షుణ్ణంగా వివరించనున్నారు.కావున ముదిమాణిక్యం,రామంచ గ్రామాలకు చెందిన రైతులందరూ ఈ అవగాహన సదస్సుకు సకాలంలో హాజరై, భూముల రీ–సర్వేపై మీకున్న సందేహాలను అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని అధికారులు కోరారు.

కరీంనగర్ మహాశక్తి ఆలయానికి పోటెత్తిన భక్తులు








***మూలా నక్షత్రం.. చదువుల తల్లి సరస్వతీదేవి దివ్యదర్శనం!**
భారీగా తరలివచ్చిన విద్యార్థులు, భవానీ భక్తులు
విద్యార్థుల అక్షరాభ్యాసం, పుస్తక పూజ, భవానీ భక్తుల రాకతో కిటకిటలాడిన మహాశక్తి ఆలయం
అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎంపీ గరికపాటి, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్
సాయంత్రం అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ
సరస్వతి దేవీని కీర్తిస్తూ నాట్యంతో ఆకట్టుకున్న మహిళలు
ప్రత్యేక డ్రెస్ కోడ్ తో అద్భుతంగా కొనసాగుతున్న 'దాండియా'

ముద్ర, కరీంనగర్ : దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో 6వ రోజైన శుక్రవారం రోజు మూలా నక్షత్రం సరస్వతి దేవీ (కాత్యాయనీ) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు శ్రీ మహాశక్తి ఆలయానికి క్యూ కట్టారు. భవానీ భక్తులు ఒకవైపు, విద్యార్థుల అక్షరాభ్యాసం, పుస్తకాల పూజ మరోవైపు... వెరసి మహాశక్తి ఆలయం జ్ఞాన సరస్వతి నిలయంగా మారిపోయింది. చదువుల తల్లి జ్ఞాన సరస్వతి దివ్య దర్శనంతో భక్తుల మనుసులు పులకించిపోయాయి. భవానీ దీక్షలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చదువుల తల్లి రూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మాజీ ఎంపీ గరికపాటి మోహన్ రావు, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పుల్లారావు యాదవ్ తోపాటు పలువురు ప్రముఖులు బండి సంజయ్ తోపాటు మహాశక్తి అలయాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు.



జ్ఞానజ్యోతులు వెలిగించే జగన్మాత.. విద్యార్థుల పాలిట వర ప్రదాయిని

అజ్ఞానమనే చీకటిని తొలగించి జ్ఞానమనే వెలుగును ప్రసాదించే చదువుల తల్లి సరస్వతీదేవి ఆరాధనకు మూలా నక్షత్రం అత్యంత విశిష్టమైనది. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాశక్తి ఆలయంలో కొలువైన అమ్మవారిని సరస్వతీదేవి రూపంలో దర్శించుకుని భక్తులు ప్రత్యేక ఆధ్యాత్మిక అనుభూతికి లోనయ్యారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, కళాకారులు, సాహితీవేత్తలు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజించి జ్ఞానం, వివేకం, ఏకాగ్రత ప్రసాదించాలని ప్రార్థించడం విశేషం.

అంగరంగ వైభవంగా అమ్మవారి పల్లకీ సేవ

దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ అంగరంగ వైభవంగా కొనసాగింది. అధ్యాత్మిక ప్రవచనాలు ఒకవైపు... సరస్వతి దేవీని కీర్తిస్తూ చిన్నారులు, మహిళలు నృత్యాలు మరోవైపు వెరసి భక్తులను కనువిందు చేశాయి. కేంద్ర మంత్రి బండి సంజయ్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు ఆద్యంతం పల్లకీ సేవలో తరించారు.

ప్రత్యేక డ్రెస్ కోడ్ తో 'దాండియా' అదరహో...

దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో ఈరోజు రాత్రి 9 గంటల తరువాత నిర్వహించే దాండియా కార్యక్రమానికి వేలాది మంది భక్తులు, ముఖ్యంగా యువతీ యువకులు హాజరై ఆధ్యాత్మిక ఆటపాటలతో చిందులేస్తూ అందరినీ ఆకట్టుకొనున్నారు. నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు ప్రత్యేక డ్రెస్ కోడ్ ధరించి 'దాండియా'కు హాజరై నృత్యాలు చేయబోతుండటం విశేషం.



కరీంనగర్‌లో సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు



ముద్ర, కరీంనగర్ : మూల నక్షత్రం సందర్భంగా కరీంనగర్‌లో దూర్గామాత మండపాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. నేడు అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. నగరంలోని వివేకానందపురి కాలనీ మండపంలో సరస్వతీదేవి రూపంలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు విద్యార్థులు, భవానీ భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థుల అక్షరాభ్యాసం నిర్వహించారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి..

ఎక్కడా పెండింగ్‌లో పెట్టొద్దు
జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



ముద్ర, కరీంనగర్ : డీఎంఎఫ్‌టీ, ఎస్‌డీఎఫ్, ఎంపీ ల్యాడ్స్ గ్రాంట్ల కింద మంజూరైన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల విషయంలో ఎక్కడా జాప్యం జరగకుండా పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి సీపీఓ రామ్ దత్తా రెడ్డి, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రాంట్ల కింద మంజూరైన అభివృద్ధి పనుల పురోగతి, నిధుల మంజూరు, పనుల ప్రస్తుత స్థితి తదితర అంశాలపై సమీక్షించారు. మంజూరైన పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పనులు పెండింగ్‌లో ఉండకుండా నిరంతరం పర్యవేక్షించాలని, క్షేత్రస్థాయిలో పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ఆదేశించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీ పీ ఓ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రష్యా సైన్యంలో చేరిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షితమేనా..?

వివరాలు తెలుపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కు సూచించిన సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి
262 వ సీఎం ప్రజావాణిలో 105 దరఖాస్తులు

ముద్ర, నిజామాబాద్ : రష్యా సైన్యంలో ఏజెంట్స్ మోసపూరిత మాటలతో చేరిన నలుగురు తెలంగాణ వాసులు సురక్షితమేనా..?, పూర్తి వివరాలు తెలుపాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యకు సీఎం ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబాపూలే ప్రజా భవన్ లో జరిగిన 262వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో... రష్యా సైన్యంలో చిక్కుకున్న నలుగురు వ్యక్తుల కుటుంబ సభ్యులు మరోసారి వచ్చి గద్వాల్ విజయలక్ష్మి ని కలిసి తమ వారి ఆచూకీ కనుగొనాలని కోరారు.

నిజాంబాద్ జిల్లా నిజామాబాద్ ఉమ్మడి జిల్లా కు చెందిన భూక్య రవీందర్ సిద్దుల అశోక్ ప్రకాష్ మహమ్మద్ అబ్జర్ ఖాన్ లను రష్యాలో ఆయిల్ కంపెనీలో ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి తీసుకెళ్లి మాయమాటలు చెప్పి రష్యా సైన్యంలో చేర్పించడంతో ఆ నలుగురు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులు సీఎం ప్రజావాణిని ఆశ్రయించారు.

ఈ నలుగురిని మోసపూరితంగా రష్యాకు తరలించిన ఏజెంట్ ఉత్తరప్రదేశ్ కు చెందిన గౌరవ్ ను నిజామాబాద్ జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి స్థానిక కోర్టులో హాజరు పరచగా.. కోర్టు ఆదేశాల మేరకు అతన్ని స్థానిక ఖిల్లా జైలుకు తరలించిన విషయం సీఎం ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి వచ్చింది. వెంటనే నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్యతో ఫోన్లో మాట్లాడిన గద్వాల్ విజయలక్ష్మి .. రష్యా సైన్యంలో ఆ నలుగురు వ్యక్తులు సురక్షితంగా ఉన్నారా లేదా అన్న విషయం ఆరా తీసి తమకు సమాచారం ఇవ్వాలని, దాన్ని బట్టి ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఆ వివరాలు త్వరలోనే తెలుపుదామని తెలుపుతామని నిజామాబాద్ సిపి సమాధానం ఇచ్చారు.

కాగా హైదరాబాద్ నగరం ఉప్పల్ కు చెందిన జయంత్ అనే విద్యార్థి కూడా రష్యాకు చదువుకోవడానికి వెళ్లి పౌరసత్వం ఆశతో రష్యా పోలీస్ విభాగంలో చేరిన విషయం కూడా సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు అందింది.




సీఎం ప్రజావాణిలో 105 దరఖాస్తులు

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన 262వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో 105 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ శాఖకు 25, హోం శాఖకు 14, బీసీ శాఖకు 15, ఇతర శాఖలకు 51 దరఖాస్తులు అందాయి. ఈ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో స్టేట్ ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి , నోడల్ అధికారి కే. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్. ఆర్. ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, సభ్యులు చెన్నమనేని శ్రీనివాస్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 17.10.2026
www.mudranews.in | @mudranews

పులియబెట్టే ప్రక్రియతో పోషకాల ప్రయోజనం!



ఇడ్లీ పిండిని పులియబెట్టడం వల్ల దాని రుచి, ఆకృతి మెరుగుపడతాయి. ఈ ప్రక్రియ కొన్ని పోషకాల శోషణకు కూడా సహాయపడవచ్చు. అయితే వండిన ఇడ్లీలో జీవించి ఉండే ప్రోబయోటిక్స్ ఉంటాయని భావించకూడదు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే 'కుంభం'

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

భువనగిరి పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో గురువారం నిర్వహించిన మార్నింగ్ వాక్ కార్యక్రమంలో కుంభం అనిల్ కుమార్ రెడ్డి పాల్గొని మైదానానికి వచ్చిన వాకర్స్‌తో ఆయన మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను, మైదానంలో కల్పించాల్సిన సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. వారి విజ్ఞప్తుల మేరకు మైదానంలో ప్రహరీ గోడ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు, విద్యుద్దీపాల సౌకర్యం, వాకర్స్ ట్రాక్ అభివృద్ధి, మరుగుదొడ్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్ సదుపాయాల కల్పన వంటి అంశాలను పరిశీలించారు.

ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వ్యాయామం, మార్నింగ్ వాక్ కోసం మైదానానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.

అనంతరం స్థానిక నాయకులతో కలిసి అల్పాహారం చేస్తూ, పలు స్థానిక అంశాలపై చర్చించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి–రవికుమార్, వైస్ చైర్‌పర్సన్ పోతంశెట్టి మంజులవెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ చంద్ర శేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి ఆలయంలో కుంకుమార్చన

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :



భువనగిరి పట్టణంలోని కిసాన్ నగర్ లో గల పెద్దమ్మ తల్లి దేవాలయంలో దుర్గామాత ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆలయంలో మహిళలు కుంకుమార్చన పూజలో పాల్గొన్నారు. సాయంత్రం బతుకమ్మ పాటలు పాడుతూ నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ నిర్వాహకులు గుర్రాల శివనాగేందర్, నాయకులు కొలుపుల వివేకానంద, కనక బాలరాజ్, కూరెల్ల మల్లేశం, కూరేళ్ల శ్రీనివాస్, ప్రధాన పూజారి భీష్మ శర్మ పాల్గొన్నారు

వెలుగుమట్ల బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి



- మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 16:

వెలుగుమట్ల భూదాన భూముల్లో ఇండ్లు కూల్చివేయబడిన నిరుపేదలందరికీ తిరిగి అక్కడే ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో బాధితులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లు కూల్చివేసి ఎనిమిది నెలలు కావస్తున్నా నేటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో బాధితులు తీవ్ర వేదనకు గురవుతున్నారని, అద్దె ఇళ్లలో ఉంటూ ఆర్థిక భారాన్ని మోస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచనామా లిస్టులోని వారితో పాటు మిగిలిన నిజమైన బాధితులందరికీ వెంటనే న్యాయం చేయాలని, లేనిపక్షంలో బాధితులతో కలిసి అక్కడే భూమిని ఆక్రమించి ఇళ్ల స్థలాలు పంచుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు ఆవుల అశోక్, వరగాని కోటేశ్వరరావు, కవిత, వెంకటేశ్వరరావు, వెలుగుమట్ల బాధితులు పాల్గొన్నారు.

ఖమ్మం బడులకు మహర్దశ.. వర్సిటీకి కొత్త దిశ

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 16:



ఖమ్మం నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నూతన భవనాల నిర్మాణం, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10.12 కోట్లు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. సచివాలయంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాతో సమావేశమైన ఆయన, పాఠశాలల అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు వినతులను అందించారు.

ఖమ్మం అర్బన్ పరిధిలోని 8, రఘునాథపాలెం మండలంలోని 8 పాఠశాలలు కలిపి మొత్తం 16 బడుల్లో మౌలిక సదుపాయాలు, డిజిటల్ బోధనా పరికరాల కల్పనకు రూ.10.12 కోట్లు అవసరమని మంత్రి వివరించారు. ఈ పాఠశాలల్లో 2,988 మంది విద్యార్థులు చదువుతున్నారని, నిధులు మంజూరైతే ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు.

కొత్తగూడెంలోని ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయానికి త్వరితగతిన రెగ్యులర్ ఉపకులపతిని నియమించి, పరిపాలనాపరమైన సమస్యలను పరిష్కరించాలని కోరారు. పరిశోధనలకు కీలకమైన ఈ వర్సిటీలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, కనీస సదుపాయాలు మెరుగుపరచాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఇచ్చిన వినతిపత్రాన్ని కూడా ఈ సందర్భంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శికి అందజేశారు.

కాంగ్రెస్ తెచ్చిన కరువుతో రైతులకు తీవ్ర అన్యాయం

- బీఆర్ఎస్ నేతలు తాతా, సండ్ర

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 16:

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే పరిపాలన పూర్తిగా గాడితప్పిందని, ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కృత్రిమ కరువు అని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తీవ్రంగా విమర్శించారు. ఖమ్మం తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, బాండ్ పేపర్లు నెరవేర్చడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మధుసూదన్ అన్నారు. కేసీఆర్ పాలనలో 24 గంటల ఉచిత విద్యుత్, ఇంటింటికీ నీళ్లు అందించి వ్యవసాయాన్ని పండుగలా మార్చగా, ప్రస్తుత పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చి కరెంట్ లేక మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ ఉత్పత్తి చేయలేక కరెంట్ కోతలు విధిస్తున్నారని, చివరికి డిప్యూటీ సీఎం పాల్గొన్న సమావేశంలోనే కరెంట్ పోయే పరిస్థితి ఉందంటే సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఉన్నప్పటికీ పంటలకు నీళ్లివ్వకుండా ఆంధ్రప్రదేశ్‌కు పారించి ఇక్కడి రైతులకు అన్యాయం చేశారని, కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే దుగ్ధతో కాళేశ్వరం నీటిని ఎత్తిపోయడం లేదని ఆరోపించారు. మొదటి పంటకే సరైన సాయం అందించకుండా, రెండో పంట వేయొద్దని రైతులను నిలదీయడం, విత్తన కంపెనీలకు నోటీసులు ఇవ్వడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ, నికరమైన బొగ్గు నిక్షేపాలు ఉన్న తెలంగాణలో కృత్రిమ కొరత సృష్టించి థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని కావాలనే తగ్గించారని విమర్శించారు. గత ఏడాదితో పోలిస్తే సింగరేణి బొగ్గు ఉత్పత్తిని తగ్గించి, విదేశీ బొగ్గు దిగుమతుల పేరిట భారీగా కమిషన్లు దండుకుంటున్నారని దుయ్యబట్టారు. స్వయంగా ముఖ్యమంత్రే తన వైఫల్యాలను అధికారులపై నెట్టేస్తూ బెదిరింపులకు దిగడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు.



రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. నీరు, కరెంట్ లేక ఎండిపోయిన పంటలకు తక్షణమే పరిహారం అందించాలని, కాలిపోయిన మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వ ఖర్చుతోనే బాగు చేయాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు నిల్వలు, సరఫరా వివరాలపై సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు, సింగరేణి బొగ్గు ఉత్పత్తి తగ్గింపు, విదేశీ దిగుమతులు, టెండర్ల వ్యవహారంపై విచారణ జరిపించాలని, ప్రైవేటీకరణ ఆలోచనలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల, నగర పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, నాయకులు బత్తుల మురళి, పగడాల నరేందర్, బలుసు మురళీకృష్ణ, యలమద్ది రవి, మహమ్మద్ రఫీ, దరిపెల్లి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో వరి వద్దే వద్దు..

ప్రత్యామ్నాయ పంటలే శ్రేయస్కరం: కలెక్టర్ దివాకర టి.ఎస్

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబరు 16:



జిల్లాలో ఎల్‌నినో పరిస్థితుల కారణంగా నీటి లభ్యత గణనీయంగా పడిపోయినందున, రాబోయే యాసంగి సీజన్‌లో రైతులు వరి సాగును విరమించుకుని ఆరుతడి పంటల వైపు మళ్లాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ సూచించారు. కలెక్టరేట్‌లో పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటిని కేవలం ప్రజల తాగునీటి అవసరాలకు, పశువుల దాహార్తి తీర్చడానికే వినియోగించాల్సి ఉన్నందున యాసంగి పంటలకు ఎలాంటి సాగునీటి విడుదల ఉండదని స్పష్టం చేశారు. జిల్లాలోని 17 మండలాల్లో కరువు ప్రభావం ఉందని, అందులో 10 మండలాల్లో తీవ్ర కరువు, 7 మండలాల్లో సాధారణ కరువు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. భూగర్భ జలాలు రోజురోజుకూ తగ్గిపోతున్నందున రైతులు వరి స్థానంలో చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు సాగు చేయాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పిస్తామని, పశువుల మేత కొరత రాకుండా రాబోయే 15 రోజుల్లో పాడి రైతులకు ఉచితంగా గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు. మిషన్ భగీరథ నీటి వృథా, అక్రమ కనెక్షన్లపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ఎస్ఐఆర్–2026 ప్రక్రియ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. నల్గొండ–వరంగల్–ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీ అని, గతంలో నమోదైన వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. నీటి పంపిణీ నిర్వహణలో ఎలాంటి ఉద్రిక్తతలు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని, రైతులు ప్రభుత్వ సూచనలను పాటించి సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ విజ్ఞప్తి చేశారు.

సూక్ష్మస్థాయి ప్రణాళికలు రూపొందించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ముద్ర, సూర్యాపేట:

ఎల్‌నినో ప్రభావంతో ప్రజలకు తాగునీరు, సాగునీరు, విద్యుత్, ఉపాధి, వైద్య ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 572 మి.మీ. ఉండగా, ఇప్పటివరకు 438 మి.మీ. మాత్రమే నమోదైందని తెలిపారు. తాగునీటికి ప్రాధాన్యతనిస్తూ రానున్న జూలై వరకు ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించాలని, డ్రిప్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. భూగర్భ జలాల పెంపునకు నీటి సంరక్షణ పనులు చేపట్టాలని, పశువులకు నీరు, పశుగ్రాసం అందుబాటులో ఉంచాలని సూచించారు. ఉపాధి హామీ పనులు కల్పించడంతోపాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరినింగ్, డీఆర్ఓ ప్రేమ్‌రాజ్, జడ్పీ సీఈవో శిరీష, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని తీర్మానం

ముద్ర ప్రతినిధి, ఖమ్మం, అక్టోబర్ 16:



జ్ఞానమే సమాజాన్ని సరైన మార్గంలో నడిపిస్తుందని, అనుభవాలే జీవితానికి విలువైన పాఠాలని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాల ఆడిటోరియంలో పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు నల్లమోతు తిరుమలరావు అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, శాస్త్రవేత్త నేదునూరి నర్సింహారావు, తెలంగాణ ఉద్యమకారుడు ముజఫరుద్దీన్, కార్టూనిస్ట్ వేణుగోపాల్, రిటైర్డ్ జడ్జి మాదార్, రిటైర్డ్ అదనపు ఎస్పీ కె. సీతారాములు తదితర ప్రముఖులు హాజరై కళాశాలతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను పంచుకున్నారు.

వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు పూర్వ విద్యార్థులు, జర్నలిస్టులు, ప్రముఖులను ఘనంగా సన్మానించారు. ఇటీవల మరణించిన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులకు సభ నివాళులర్పించింది. పమ్మి రవి, రామలక్ష్ముడు బృందం నిర్వహించిన ఆటపాటల కార్యక్రమం అలరించింది. సుమారు 500 మంది పాల్గొన్న ఈ సమ్మేళనంలో కళాశాలను యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేయాలని, జిల్లా కోర్టును తరలిస్తే ఆ భవనాల్లో ప్రభుత్వ న్యాయ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి వీరెల్లి ఆనంద్‌కుమార్, ఎస్. మణిభూషణాచారి, వూడుగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాయ కృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ పట్టణంలో వీధి వీధినా రోడ్లను శుభ్రపరుస్తూ కార్మికులు అనారోగ్యాల పాలవుతూ ఆరోగ్యాలు బాగు లేక పనులు చేయలేక పోతున్నారని అధికారులు కార్మికులపై నిర్లక్ష్యం వహిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆడెపు వెంకటేష్, గాయపాక లక్ష్మీనారాయణ, సిరిపంగి రవి, కార్మికులు పాల్గొన్నారు.

డీఈ కార్యాలయం ఎదుట బిజెపి కిసాన్ మోర్చా ధర్నా

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :

జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని బిజెపి కిసాన్ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భువనగిరి డిఈ కార్యాలయం ఎదుట గురువారం బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా బిజెపి అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు దాసరి మల్లేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ రెడ్డి, మాయ దశరథ, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కాదు అచ్చయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పట్నం శ్రీనివాస్, జైనపల్లి శ్యాంసుందర్ రెడ్డి, సుర్వి శ్రీనివాస్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు సురకంటి రంగారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు దయ్యాల కుమారస్వామి, మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రామచందర్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు రాజు, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శులు పడమటి మాణిక్యం రెడ్డి, బోల నరసింహ యాదవ్, తునికి దశరథ, భువనగిరి టౌన్ అధ్యక్షులు రత్నపురం బలరాం, మండలం అధ్యక్షులు చీర్కా సురేష్ రెడ్డి గారు, వలిగొండ మండల అధ్యక్షులు బోళ్ల సుదర్శన్, నరసింహారావు, రాళ్ల బండి కృష్ణ చారి, నాగు వినోద్ కుమార్, మాటూరు అనిల్ గౌడ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 17.10.2026
www.mudranews.in | @mudranews

సులభంగా జీర్ణమయ్యే ఆహారం ఇడ్లీ!

ఇడ్లీలు ఆవిరిపై ఉడికించడం వల్ల తక్కువ నూనెతో తయారవుతాయి. మృదువుగా ఉండే ఇడ్లీలు చాలా మందికి సులభంగా జీర్ణమవుతాయి. అందుకే ఉదయం అల్పాహారంగా ఇడ్లీ మంచి ఎంపికగా నిలుస్తుంది.



తెలంగాణలో ప్రశాంతంగా ముగిసిన బార్ల లక్కీ డ్రా..

41 బార్లకు వేల సంఖ్యలో దరఖాస్తులు
హైదరాబాద్‌లో 14 బార్లకు లక్కీ డ్రా
జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో ఎంపిక
విజేతలకు లైసెన్స్ అనుమతి పత్రాలు



ముద్ర, హైదరాబాద్ :తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వ్యాపారులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూసిన బార్ల లక్కీ డ్రా ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో ముగిసింది. ఆబ్కారీ శాఖ క్యూర్ (TCUR) పరిధిలోని 14 బార్లతో పాటు, వివిధ జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని మరో 27 బార్లు.. మొత్తం 41 బార్లకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన 'లక్కీ డ్రా ఆఫ్ లాట్స్' ప్రక్రియను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు.

హైదరాబాద్‌లో కోలాహలం.. దరఖాస్తుదారుల కిటకిట

గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ల పరిధిలోని 14 బార్లకు లక్కీ డ్రాని నగరంలోని 'ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ హాల్ 'లో నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచే దరఖాస్తుదారులు హాల్ వద్దకు బారులు తీరారు. ఈ 14 బార్ల కోసం ఏకంగా 4,251 దరఖాస్తులు వచ్చాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యక్షంగా డ్రా ప్రక్రియను చేపట్టారు.

ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించారు. దరఖాస్తుదారుల సమక్షంలోనే వారికి కేటాయించిన నంబర్ల నాణేలను అందరి ముందు ఒకే బాక్స్ లో వేశారు. సికింద్రాబాద్ ఈఎస్ జీవన్ కిరణ్ బాక్స్ ను బాగా కుదిపిన అనంతరం, కమిషనర్ హరికిరణ్ చేతితో కాయిన్ ను తీసి అడిషనల్ కమిషనర్ సయ్యద్ యాషిన్ ఖురేషికి అందించారు. ఎంపిక చేసిన నంబర్లను వెంటనే మైకులో ప్రకటించడంతో పాటు పెద్ద స్క్రీన్ పై డిస్ ప్లే చేశారు. ఈ విధంగా 14 దఫాలుగా డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. లక్కీ డ్రాలో విజేతలుగా నిలిచిన వారికి ఎక్సైజ్ సిబ్బంది వెంటనే బార్ లైసెన్స్ అనుమతి పత్రాలను అందజేశారు.

జిల్లాల్లో కలెక్టర్ల పర్యవేక్షణలో డ్రాలు

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని 27 బార్లకు మొత్తం 4,519 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జిల్లాల కలెక్టర్ల సమక్షంలో డ్రా ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేశారు. భద్రాద్రి కొత్తగూడెం (అశ్వారావుపేట), ఖమ్మం (కల్లూరు), మహబూబ్ నగర్ (మక్త, దేవరకద్ర, మద్దూరు, మహబూబ్ నగర్), సంగారెడ్డి (గడ్డపోతారం, గుమ్మిడాల, కోహీర్), నిజామాబాద్ (బోధన్), కామారెడ్డి (బిచ్ కుంద), ఫ్యూచర్ సిటీ (చేవెళ్ల, మొయినాబాద్), వికారాబాద్ (కొండంగల్, పరిగి), వరంగల్ రూరల్ (నర్సంపేట), జనగామ (స్టేషన్ ఘన్ పూర్), మహబూబాబాద్ (కేసముద్రం)లతో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని బార్లకు ఆయా జిల్లాల కలెక్టర్లు డ్రా తీసి విజేతలను ప్రకటించారు.

భారీ ఎత్తున పోటీ ఉన్నప్పటికీ బార్ల లక్కీ డ్రా ప్రక్రియ ఎక్కడా చిన్నపాటి అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా ప్రశాంతంగా ముగియడంతో ఎక్సైజ్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ లక్కీ డ్రా విజయవంతంగా ముగిసేందుకు సహకరించిన దరఖాస్తుదారులకు, రాత్రింబవళ్లు కష్టపడిన ఎక్సైజ్ అధికారులకు , సిబ్బందికి కమిషనర్ సి.హరికిరణ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఎల్‌నినో ఎదుర్కొనేందుకు
రంగంలోకి తెలంగాణ సర్కార్..

10 జిల్లాలకు ప్రత్యేక ఐఏఎస్‌లు
ఎల్ నినో ప్రభావంపై తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తం
ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్‌లు
తాగునీరు, సాగునీటి పరిస్థితులపై సమీక్ష
అత్యవసర పరిస్థితుల్లో తక్షణ చర్యలు

ముద్ర, హైదరాబాద్ : రాష్ట్రంలో తీవ్రరూపం దాల్చుతున్న ఎల్ నినో ప్రభావం, తాగు, సాగునీటి కొరత , ముంచుకొస్తున్న వాతావరణ అత్యవసర పరిస్థితులను అధిగమించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్ నినో పరిస్థితులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, తగిన అత్యవసర చర్యలు చేపట్టేందుకు వీలుగా ఉమ్మడి పది జిల్లాలకు సీనియర్ ఐఏఎస్ అధికారులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల బాధ్యతలు చేపట్టిన సీనియర్ అధికారులు

జిల్లాల వారీగా పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అనుభవజ్ఞులైన అధికారులకు అప్పగించింది. ఉమ్మడి హైదరాబాద్ జిల్లాకు జయేష్ రంజన్, రంగారెడ్డి జిల్లాకు వికాస్ రాజ్, కరీంనగర్ జిల్లాకు బెనహర్ మహేష్ దత్తా ఎక్కా, మెదక్ జిల్లాకు ఎ. వాణి ప్రసాద్ ప్రత్యేక అధికారులుగా వ్యవహరిస్తారు. అలాగే నిజామాబాద్ జిల్లాకు యోగితా రాణా, నల్గొండ జిల్లాకు హరిచందన దాసరి, ఆదిలాబాద్ జిల్లాకు ఇలాంబర్తి కె., వరంగల్ జిల్లాకు ఎ. శ్రీదేవిసేన, మహబూబ్‌నగర్ జిల్లాకు వి.పి. గౌతమ్, ఖమ్మం జిల్లాకు అనుదీప్ దురిశెట్టి నియమితులయ్యారు.

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ, కార్యాచరణ

నియమితులైన ప్రత్యేక ఐఏఎస్ అధికారులు తమకు కేటాయించిన ఉమ్మడి జిల్లాల్లో నిరంతరం పర్యటిస్తూ ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తాగునీటి ఎద్దడి, సాగునీటి లభ్యత, వర్షపాతం నమోదు స్థితిగతులను సమీక్షిస్తారు. వీటితో పాటు వ్యవసాయం, గృహ అవసరాలకు అందుతున్న విద్యుత్ సరఫరా తీరుపై క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని సమన్వయం చేస్తారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి తలెత్తినా తక్షణ ఉపశమన చర్యలు చేపట్టడంతో పాటు, ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికలు అందించేలా కార్యాచరణను సిద్ధం చేశారు.



మెదక్ లో వైభవంగా అట్ల బతుకమ్మ

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా కేంద్రం మెదక్ పట్టణంలో అట్ల బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రధాన కూడళ్ళు, దేవాలయాల ప్రాంగణంలో బతుకమ్మలు ఉంచి మహిళలు ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం నిమజ్జనం చేశారు.



ఆరోగ్యకరమైన తల్లి, బిడ్డ ప్రభుత్వ లక్ష్యం
కలెక్టర్ ప్రతిమా సింగ్



ముద్ర ప్రతినిధి, మెదక్: ఆరోగ్యకరమైన తల్లి, బిడ్డ ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. పిల్లల ఆరోగ్యం, పోషణ, సమగ్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను నిరంతరం అందించాలని తెలిపారు. మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మాసం – 2026 ముగింపు కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. గణేశ్వర్, అడిషనల్ డిఆర్డిఓ సరస్వతి, మెదక్, రామయంపేట్ సిడిపిఓలు వెంకటరమణ స్వరూప హాజరయ్యారు. కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... ప్రతి కుటుంబం పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలని, పిల్లలు, గర్భిణీలు, బాలింతలు, కిషోర బాలికలకు వయస్సు అవసరాలకు అనుగుణంగా సమతుల ఆహారం అందించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. 9వ జాతీయ పోషణ మాసంలో భాగంగా నెల రోజుల పాటు పోషణ ప్రాముఖ్యత, పోషణ్ ట్రాకింగ్, జన ఆందోళన్, సమతుల ఆహారం , పోషకాహారం వంటి అంశాలపై గర్భిణీలు, బాలింతలు, తల్లిదండ్రులు, కిషోర బాలికలు , పిల్లలకు అవగాహన కల్పించారని తెలిపారు.. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు , కిషోర బాలికలకు అందించాల్సిన వివిధ రకాల పోషకాహారం గురించి వివరించారు. జాతీయ పోషకాహార మాసంలో ఉత్తమ సేవలందించిన అధికారులను, అంగన్వాడి సిబ్బందిని కలెక్టర్ మెమెంటోలతో సత్కరించారు. పిల్లలు ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్స్‌ను సందర్శించి, వారు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు, వైద్య శాఖ అధికారులు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమ కళాకారుల రిలే నిరాహార దీక్ష



ముద్ర ప్రతినిధి, మెదక్: తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ముందు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతిక సారథిలో ఉద్యమ కళాకారులకు వెయ్యి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన కళాకారులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, ఉచిత రవాణా సౌకర్యం కల్పించాలని, అర్హులైన కళాకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ కళాకారులను ఆదుకోవాలన్నారు. ఉపాధ్యక్షులు నీరుడి సాయిలు, శేఖర్ చారి, భూమయ్య, శ్రీశైలం గౌడ్, సుభాష్, బిక్షపతి, చంద్రశేఖర్, సిద్దు, యాదగిరి, నవీన్, స్వామి, మూరళీ, సుమలత పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు





పూజలు చేసి, బతుకమ్మ ఆడిన ఎస్పీ

ముద్ర ప్రతినిధి, మెదక్: జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు.

తెలంగాణ ప్రకృతి అందాలు, ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.

ఈ ఉత్సవాలలో ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డియస్పి ప్రసన్న కుమార్, సీఐలు సందీప్ రెడ్డి, జార్జ్, కృష్ణమూర్తి, శైలందర్, రామకృష్ణ, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతి, మహాలక్ష్మిగా దర్శనం

చిన్నారులకు పలకలు అందజేసిన తహసీల్దార్

ముద్ర ప్రతినిధి, మెదక్: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు అమ్మవార్లు మహాలక్షి , సరస్వతి దేవి అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మెదక్ కాళికాదేవి ఆలయంలో మహాలక్షి గా, జక్కన్నపేట మండపంలో సరస్వతిగా అమ్మవారు కొలువుదీరారు. తహసీల్దార్ సింధు రేణుకా ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులకు పలక, బలపాలు అందజేసి అక్షరాభ్యాసం చేయించారు. బోరంచమ్మ, కుమ్మరిగడ్డ హనుమాన్ దేవాలయాల్లోనూ అమ్మవారు సరస్వతిగా దర్శనమిచ్చారు.





పూలను దైవంగా కొలిచే గొప్ప సంస్కృతి

బతుకమ్మ ఆడిన కలెక్టర్ ప్రతిమా సింగ్
కలెక్టరేట్ లో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

ముద్ర ప్రతినిధి, మెదక్: కలెక్టరేట్ ప్రాంగణంలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ ప్రతిమ సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు శ్రీనివాస్ రావు, మాధవి, హేమ భార్గవి, సరస్వతి, హన్మంత్ రెడ్డి, మాణిక్యం, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వాములయ్యారు. కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. శాఖల వారిగా పోటా పోటీగా రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒక చోటకు చేర్చారు. ఐకేపీ, మెప్మా మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ...

కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ...మహిళలను శక్తి స్వరూపిణులుగా గౌరవించే గొప్ప సంస్కృతి తెలంగాణ సొంతమని అన్నారు. పూలను దైవాలుగా కొలుస్తూ ప్రకృతిని







ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ మహిళల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.

డిఆర్డిఓ బతుకమ్మకు ప్రథమ స్థానం, జిల్లా సంక్షేమ శాఖకు ద్వితీయ స్థానం, వైద్య, ఆరోగ్య శాఖకు తృతీయ స్థానం దక్కింది.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medehal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No.TELTEL/2013/50413. e mail mudradaily@gmail.com, Cell 9949193555